DD9 వార్త
తెలుగు దినపత్రిక
www.dd9vaartha.com
సంపుటి : 01 సంచిక : 104 ఆదివారం, నవంబర్ 30, 2025, పేజీలు - 10 వెల : 3/-

### మంచిమాట

మంచిమాట దానం లాంటిది, ప్రతిఫలంగా పుణ్యాన్ని అందిస్తుంది. చెడ్డమాట అప్పులాంటిది, ప్రతిగా వడ్డీ చెల్లించాల్సి వస్తుంది.

# పంచాయతీ ఎన్నికలు

## - ముగిసిన తొలివిడత నామినేషన్ల గడువు

**హైదరాబాద్ :** పంచాయతీ ఎన్నికలు మొదటి దశకు సంబంధించి నామినేషన్ల గడువు ఇవాళ సాయంత్రం ముగిసింది. మొదటి విడతలో 4,236 గ్రామ పంచాయతీలు, 37,440 వార్డుల్లో నామినేషన్లు స్వీకరిం చారు. ఆదివా రం నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటు అయిన నామినేషన్ల వివరాలు వెల్లడిస్తారు. సోమవారం అప్పీళ్ల స్వీకరణ, వచ్చే నెల 2న అప్పీళ్ల పరిష్కారం ఉంటుంది. వచ్చే నెల 3న నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియనుంది. అదే రోజు పోటీలో అభ్యర్థుల వివరాలు వెల్లడిస్తారు. డిసె ంబర్ 11న పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఉప సర్పం చిఎన్నికఉంటుందనిఅధికారులు తెలిపారు.



# కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- రెండు కార్లు ఢీకొని ఐదుగురు మృత్యువాత
- ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురు మృతి
- మంత్రాలయం దర్శనం కోసం వస్తుండగా ఘటన
- మృతులు కర్నాటక వాసులుగా గుర్తింపు

**కర్నూలు,29 :** కర్నూలు జిల్లా పరిధిలో శనివారం ఉదయం రెండు రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. ఓ ప్రమాదంలో రెండు కార్లు ఢీకొని ఐదుగురు కర్నాకట వాసులు దుర్మరణం చెందారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని కొటే కల్ గ్రామం వద్ద ఈ ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది.. రెం డు కార్లు ఢీకొన్న ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులు సహా మొత్తం ఐదుగురు మృత్యువాత పడ్డారు. మరో నలుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆదోనికి మిగతా2లో...



## తీరం దాటనున్న దిత్వా తుఫాన్..

- ఏపీ, తమిళనాడు, పుదుచ్చేరిలో రెడ్ అలర్ట్..!

**అమరావతి,29 :** శ్రీలంకలో విధ్వంసం సృష్టిస్తున్న దిత్వా తుఫాన్ భారత్‌లోని తీర ప్రాంతాలను ముంచెత్త నుంది. రాబోయే 24 గంటల్లో ఈ తుఫాన్ తమిళనాడు, పుదుచ్ఛేరి, ఆంధ్రప్రదేశ్‌లో తీరం దాటనుంది. శ్రీలంకలో భారీగా ఆస్తి, ప్రాణ నష్టానికి కారణమైన ఈ తుఫాన్ నవంబర్ 30 ఉదయానికల్లా తీరం దాటే అవకాశముంది. మిగతా2లో...

# కర్నాటకలో మళ్లీ రాజకీయ సెగ

- కాంగ్రెస్ అధిష్టానం ఆదేశంతో సిద్దుతో డికె భేటీ
- ఇరువురు నేతలు బ్రేక్‌ఫాస్ట్ చర్చలు
- 2028లో గెలుపు కోసం చర్చించామని వెల్లడి






# ఎనర్జీ ఉంటేనే పెట్టుబడులు

- స్టోరేజికి అనుగుణంగా గ్రీన్ ఎనర్జీ
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ టార్గెట్
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**హైదరాబాద్,నవంబర్ 29:** గ్రీన్ ఎనర్జీ.. దేశ, ఆయా రాష్ట్రాల అభివృద్ధికి చాలా అవసరమని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ అనే చర్చ జరుగుతుందని అన్నారు. పారిస్ లో జరిగిన అగ్రిమెంట్ ప్రకారం అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 50 శాతం తప్పకుండా గ్రీన్ ఎనర్జీ ఉండాలని అగ్రిమెంట్ చేసిన విషయాన్ని మిగతా2లో...

# డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు

- అప్రమత్తంగా ఉండాల్సిన తరుణం - ఫేక్ కాల్స్ ఎత్తి సమాచారం ఇవ్వరాదు - అనుమానం ఉటే 1930కు ఫిర్యాదు చేయాలి - ప్రజలను అప్రమత్తం చేసిన హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్

**హైదరాబాద్,నవంబర్ 29:** డిజిటల్ అరెస్ట్ పేరుతో దేశవ్యాప్తంగా పెరుగుతున్న కొత్త రకం సైబర్ మోసాల నేపథ్యంలో హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ యూనిట్ తాజాగా ప్రజలకు ముఖ్య హెచ్చరిక జారీ చేసింది. ఇలాంటి మోసాలు హైదరాబాద్‌లో కూడా విస్తరిస్తున్నాయి. నకిలీ పోలీస్, సీబీఐ, ఈడీ, కస్టమ్స్, లేదా కోరియర్ కంపెనీల అధికారులుగా నటి స్తూ కాల్‌చేసే మోసగాళ్లు, మనీ మిగతా2లో...






# భూములు అమ్ముకునే కుట్ర

- గ్లోబల్ సమ్మిట్ పేరుతో రియల్ వ్యాపారం
- సిఎం రేవంత్‌పై సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ ఆరోపణలు

# వేగంగా మామునూరు విమానాశ్రయ నిర్మాణం

- ముందుగా ఏటీఆర్ విమానాలు నడుపుతాం
- చురుకుగా కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు
- అమృత్ పథకం కింద వరంగల్ జిల్లాకు రూ.874 కోట్లు మంజూరు
- వరంగల్ పర్యటనలో మీడియాతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి





# శ్రీలంకను ఉక్కిరిబిక్కిరి చేసిన దిత్వా..


- 123 మంది దుర్మరణం




## తిరుమల కల్తీనెయ్యి కేసు

- మరో 11మందిని నిందితులుగా చేర్చిన అధికారులు




## తెలంగాణలో రాజకీయ కోలాహలం

### ముగిసిన తొలిదశ నామినేషన్ల గడువు

**హైదరాబాద్,నవంబర్ 29 :** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం కొనసాగుతోంది. రాష్ట్రంలో తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ పక్రియ గురువారం ప్రారంభమైన విషయం తెలిసిందే. శనివారంతో మొదటి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల గడువు ముగిసింది. తొలి రోజే సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు అభ్యర్థుల నుంచి భారీ స్పందన మిగతా2లో...

# 1 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

### రాజ్‌నాథ్ అధ్యక్షతన నేడు అఖిలపక్ష భేటీ






# కెసిఆర్ ఎప్పుడు రావాలో అప్పుడే వస్తారు

- కొందరు మూర్ఖులు కనిపించడం లేదంటున్నారు
- కెసిఆర్‌ది దొంగదీక్ష అన్న వారికి ఉద్యమం ఏంతెలుసు
- కాంగ్రెస్ నేతలపై మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్

**హైదరాబాద్,నవంబర్ 29 :** కొందరు మూర్ఖులు కేసీఆర్ కనిపించడం లేదని అంటున్నారని.. గోడకు వేలాడదీస్తే తుపాకీ కూడా మౌనంగానే ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెం ట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ లేకపోతే తెలం గాణ లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ ంలో పాల్గొనని వారు కేసీ ఆర్‌ను విమర్శిస్తున్నారని మండిప డ్డారు. పీసీసీ అధ్యక్షుడు కేసీఆర్ దీక్ష.. దొంగ దీక్ష అని మాట్లా డుతున్నారని.. అడ్డమైన మాటలు కొం దరు మాట్లాడు తున్నా రంటూ ఫైర్ అయ్యారు. సింహం తన గాథను తాను చెప్పుకో కపోతే, వేటగాడు చెప్పే పిట్టకథనే నిజం అనుకుంటారు అంటూ కేటీఆర్ పేర్కొన్నారు. దీక్షా దివస్ మిగతా2లో...

# ఎనర్జీ ఉంటేనే పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ఈ సందర్భంలో గుర్తు చేశారు. తెలంగాణ భవిష్యత్ విద్యుత్ అవసరాలకు ప్రణాళికలు సిద్ధం చేశామని, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ టార్గెట్‌తో తెలంగాణ ముందుకు పోతుందని భట్టి వెల్లడించారు. తెలంగాణ ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా తీర్చి దిద్దుతున్నామని, హైదరాబాద్ గ్లోబల్ హబ్ కాబోతోందని భట్టి తెలిపారు. 2047 వరకు మూడు ట్రిలియన్‌ల ఎకానమీకి చేరుకోవాలనేది లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అందుకు కావలసిన పెట్టుబడులకు అవసరమైనది విద్యుత్ అన్నారు. అనుకున్న లక్ష్యం చేరుకోవడానికి ప్లానింగ్ చేస్తున్నాం.. పవర్ డిమాండ్ రాష్ట్రంలో పదేళ్లుగా పెరుగుతుందని తెలిపారు. తాజాగా ప్రజా భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.. 2014 నుంచి విద్యుత్తు 14.2 డిమాండ్ గ్రోత్ ఉందన్నారు.. 2020- 2021 నుంచి 5.44 గ్రోత్, 2024- 25లో 9.8 శాతం గ్రోత్ కనిపించిందని వెల్లడించారు. 2025 నుంచి 34, 35 వరకు తెలంగాణలో 6.4 గ్రోత్ ఉండే అవకాశం ఉందని స్పష్టం చేశారు. మూసి ప్రక్షాళన.. ఫ్యూచర్ సిటీ.. పెట్టుబడుల ఒప్పందం.. పరిశ్రమలు.. డేటా సెంటర్లతో హైదరాబాద్ గ్లోబల్ హబ్‌గా మారబోతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. 8.50 గ్రోత్ ఉండబోతుంది.. 2047 కి లక్ష 39 వేల మెగావాట్ల విద్యుత్ అవసరం.. తెలంగాణలో 2026 ఏప్రిల్ నాటికి 24769 మెగావాట్ల విద్యుత్ అందుబాటులో ఉంది.. వాడే విద్యుత్తులో 50 శాతం గ్రీన్ ఎనర్జీ వాడాలి.. ఎనర్జీ స్టోరేజ్ ప్లాన్ గతంలో లేదు.. పదేళ్ల క్రితం ప్లాన్ చేసుకుని ఉంటే బాగుండేది.. అవసరాలకు అనుగుణంగా ఎనర్జీ స్టోరేజ్ ప్లానింగ్ లేదు.. గ్రీన్ పవర్ ఎనర్జీ స్టోరేజ్‌కి తెలంగాణ అనుకూలం.. పదేళ్లుగా ఇలాంటి ప్రయత్నాలు చేయలేదు.. కానీ ఏపీ మొదలుపెట్టింది.. తెలంగాణలో మాత్రం ఆ ప్రయత్నమే లేదు.. థర్మల్ పవర్ కంటే.. గ్రీన్ ఎనర్జీ వస్తుంది.. కానీ తెలంగాణ అందుకోలేక పోయింది. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత.. డిలైట్ లాంటి వాళ్ళను నివేదిక ఇవ్వండి అని అడిగాం.. ఒక్కరోజు బ్లాక్ ఔట్ అయితే 1500 నుండి 2000 కోట్లు నష్టపోతం.. అని వెల్లడించారు.

# డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు

(మొదటి పేజీ తరువాయి)

లాండరింగ్, టెర్రరిజం, నార్కోటిక్స్ కేసులు, ట్రాఫికింగ్ వంటి తీవ్ర నేరాల్లో కేసులు నమోదయ్యాయని చెప్పి ప్రజలను భయపెట్టి డబ్బు లాక్కోవడం ఈ స్కాం కీలక లక్ష్యంగా పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి కాల్స్ ద్వారా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.. బాధితులకు వీడియో కాల్ లేదా ఫోన్ ద్వారా అరెస్ట్ చేస్తున్నాం అని నటిస్తూ, ఖాతాలను ఫ్రీజ్ చేస్తామని, వారెంట్లు జారీ అయ్యాయని నమ్మించి మోసం చేస్తారని హెచ్చరించారు. మోసగాళ్లు తమ కుట్రను బలపరచేందుకు నకిలీ వారెంట్లు, లేఖలు వంటి కట్టుకథల డాక్యుమెంట్లు తయారు చేసి పంపిస్తారు. అనుమానం లేకుండా ఉండేందుకు కుటుంబ ప్రతిష్టకు హాని కలుగుతుందని చెప్పి ఒత్తిడి పెంచుతారు. కేసు నుండి బయటపడాలంటే భారీ మొత్తం డబ్బు సేకరించి సుప్రీం కోర్టుకు డిపాజిట్ చేయాలి అని చెప్పి వెంటనే ట్రాన్స్ఫర్ చేయిస్తారు. కుటుంబ సభ్యులకు చెప్పొద్దని హెచ్చరిస్తూ సోషల్ ఇంజినీరింగ్ పద్ధతులను వినియోగిస్తారని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో సైబర్ క్రైమ్ యూనిట్ ప్రజలకు స్పష్టమైన సూచనలు ఇస్తోంది.. డిజిటల్ అరెస్ట్ అనే దాంట్లో ఏమీ లేదు. నిజమైన పోలీసులు ఎప్పుడూ ఫోన్, లేదా వీడియో కాల్ ద్వారా అరెస్ట్ చేయరు. కాలర్ స్పూఫ్ చేయబడవచ్చు కాబట్టి ఏ అధికారిక కాల్ వచ్చినా వెంటనే నమ్మేయకూడదు. పాన్, ఆధార్, బ్యాంక్ వివరాలు వంటి వ్యక్తిగత లేదా ఆర్థిక సమాచారాన్ని ఎవరితోనూ పంచకూడదు. అనుమానం వచ్చిన వెంటనే కాల్‌ను కట్ చేసి, కాలర్ ఇచ్చిన నంబర్లకు తిరిగి కాల్ చేయకుండా, స్థానిక పోలీస్ స్టేషన్ లేదా ప్రభుత్వ అధికారిక హెల్ప్‌లైన్ ద్వారా మాత్రమే ధృవీకరించాలి. మెసేజ్లు, స్క్రీన్‌షాట్లు, కాల్ లాగ్స్ వంటి సాక్ష్యాలను భద్రపరచడం కూడా చాలా ముఖ్యమని అధికారులు తెలిపారు. ఇలాంటి మోసాలు ఎదురైనపుడు వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు కాల్ చేయాలని లేదా ఫిర్యాదు చేయాలని సూచించారు. తాజా అప్డేట్ల కోసం హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ అధికారిక సోషల్ మీడియా పేజీలను,ఖాతాలను ఫాలో కావాలని చెప్పారు. డిజిటల్ ప్రపంచం వేగంగా మారుతున్న కొద్దీ మోసగాళ్ల పద్ధతులు కూడా అధునాతనంగా మారుతున్నాయి. ఒక్క ఫోన్ కాల్, ఒక్క మెసేజ్ కూడా భారీ నష్టానికి దారితీసే ప్రమాదం ఉందన్నారు.

# వేగంగా మామునూరు విమానాశ్రయ నిర్మాణం

**హన్మకొండ,నవంబర్ 29 :** వరంగల్ విమానాశ్రయం నిర్మాణ పనులు వేగవంతం చేయాలని నిర్ణయించామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఇక్కడి నుంచి ముందుగా ఏటీఆర్ విమా నాలు నడపాలని భావిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శనివారం వరంగల్‌లో పర్యటిం చారు. పలు అభివృద్ధి పనులపై అధికారులతో సమీ క్షించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆ తర్వాత పౌరుల స్పందన బట్టి మరిన్ని సర్వీసులు నడుపుతాం అన్నారు.. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. అమృ త్ పథకం కింద వరంగల్ జిల్లాకు రూ.874 కోట్లు మంజూరయ్యాయి. కాజీపేట రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పామని అన్నారు. హృదయ్ పథకం కింద పురాతన ఆలయాల పునరుద్ధరణకు కేంద్రం నిధులు ఇచ్చింది. రామప్ప ఆలయం అభివృద్ధి కోసం కేంద్రం రూ.146 కోట్లు ఖర్చు చేస్తోందని కిషన్‌రెడ్డి వివరించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్‌కి చిత్తశుద్ధి లేదని కిషన్‌రెడ్డి విమర్శలు చేశారు. బీసీలకు కాంగ్రెస్ అన్యాయం చేసిందని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్‌దే పూర్తి బాధ్యత అని.. ఈ విషయంలో ఆ పార్టీది కపటనాటకమని ఎద్దేవా చేశారు. బీజేపీకి ప్రధాన శత్రువు కాంగ్రెస్ మాత్రమే అని స్పష్టం చేశారు. రిజర్వేషన్లపై బీఆర్ఎస్‌కు మాట్లాడే నైతికత లేదని ఆక్షేపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు బీసీలకే కేటాయిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఫిరాయింపులను ప్రోత్సహించాయని మండిపడ్డారు. బీసీలకు ఇచ్చే సీట్లలో ముస్లింలు పోటీచేసే అవకాశం ఉందని.. ఇది బీసీలకు అన్యాయం చేసినట్లు కాదా...? అని ప్రశ్నించారు. మేడారం జాతరకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుందని స్పష్టం చేశారు కిషన్‌రెడ్డి.మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించిన భూసేకరణ చివరి దశలో ఉందని చెప్పుకొచ్చారు. హైదరాబాద్ నుంచి పరిశ్రమలు పోతే మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడతారని.. ఈ విషయంపై తాము పోరాడుతున్నామని చెప్పుకొచ్చారు. పరిశ్రమలపై సీఎం రేవంత్‌రెడ్డి ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# 1 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

**న్యూఢిల్లీ,నవంబర్ 29 :** పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 19వ తేదీ వరకూ ఈ సమావేశాలు జరుగుతాయి. సమావేశాలకు ముందు సంప్రదాయంగా నిర్వహించే అఖిలపక్ష సమావేశాన్ని ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈ అఖిలపక్ష సమావేశం జరుగనుంది. పార్లమెంటు సమావేశాలు సజావుగా జరిగేలా సహకరించాలని కేంద్రం కోరనుంది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో పలు అంశాలపై చర్చకు విపక్షం కసరత్తు చేస్తోంది. సర్‌తో సహా ఢిల్లీ కాలుష్యం తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఇకపోతే కీలకమైన పౌర అణు ఇంధన రంగంలో ప్రైవేటు రంగానికి ఆహ్వానం పలికేందుకు ఉద్దేశించిన 'ది ఆటమిక్ ఎనర్జీ బిల్లు-2025'తో సహా 10 కీలక బిల్లులు సభ ముందుకు రానున్నాయి. పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న కీలకమైన బిల్లులలో 'ది ఆటకమిక్ ఎనర్జీ బిల్లు-2025'తో పాటు సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు (ఎస్ఎంసి)-2025, జాతీయ రహదారుల (సవరణ) బిల్లు, అర్బిట్రేషన్, కాన్సిలియేషన్ (సవరణ) బిల్లు, ఇన్సూరెన్స్ చట్ట (సవరణ) బిల్లు, ఇన్సాల్వెన్సీ, దివాలా కోడ్ (సవరణ) బిల్లు, కార్పొరేట్ చట్ట (సవరణ) బిల్లు, ది హైయర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా బిల్లు-2025, ది మణిపూర్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (సవరణ) బిల్లు-2025, జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు-2025 ఉండనున్నాయి. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా చట్టం-1992, డిపాజిటరీస్ చట్టం-1996, సెక్యూరిటీస్ కాంట్రాక్ట్స్ (నియంత్రణ) చట్టం-1956లను విలీనం చేసేందుకు 'సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు-2025'ను కేంద్రం తీసుకువస్తోంది. జాతీయ రహదారుల విస్తరణ, పొడిగింపుకోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియ వేగంగా, అత్యంత పారదర్శకంగా జరిగేందుకు వీలుగా నేషనల్ హైవేస్ (సవరణ) బిల్లును తెస్తోంది. చేయని తప్పులకు కంపెనీ డైరెక్టర్లు బాధ్యులు అవుతున్నందున అవాంఛనీయ దర్యాప్తు, విచారణల నుంచి రక్షణ కల్పించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఆర్బిట్రేషన్, కాన్సిలేయేషన్ చట్ట సవరణ బిల్లును పార్లమెంటులో కేంద్రం ప్రవేశపెట్టనుంది. దీనిపై సూచనల కోసం కమిటీకి సిఫారసు చేసే అవకాశం ఉంది. కాగా, ది హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా బిల్లుతో ఏకీకృత ఉన్నత విద్యా కమిషన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం కొత్త బిల్లు తీసుకురానుంది. కాగా, చండీగఢ్ కేంద్ర పాలిత ప్రాంతాన్ని రాజ్యాంగంలోని 240వ అధికరణ పరిధిలోకి తెచ్చే బిల్లు పార్లమెంటులో ప్రవేశపెడతారని అనుకున్నప్పటికీ అలాంటి ఆలోచన ఏదీ లేదని ఇటీవల కేంద్రం ప్రకటించింది.

# తిరుమల కల్తీనెయ్యి కేసు

## - మరో 11మందిని నిందితులుగా చేర్చిన అధికారులు

**తిరుమల,నవంబర్ 29 :** తితిదే కల్తీ నెయ్యి కేసులో సీబీఐ నేతృత్వంలోని సిట్ విచారణ వేగవంతం చేసింది. కేసు నమోదు చేసిన సమయంలో 15 మందిని, ఆ తర్వాత 9 మందిని నిందితులుగా పేర్కొన్న సిట్.. తాజాగా మరో 11 మందిని నిందితులుగా చేరుస్తూ నెల్లూరు ఏసీబీ కోర్టులో మెమో దాఖలు చేసింది. వారిలో ఏడుగురు తితిదే ఉద్యోగులు ఉన్నారు. 2019-2024 మధ్య తితిదే కొనుగోలు విభాగంలో పని చేసిన జీఎంలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లపై సిట్ కేసులు నమోదు చేసింది.

# కెసిఆర్ ఎప్పుడు రావాలో అప్పుడే వస్తారు

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ... కేసీఆర్ ఎప్పుడు బయటకు రావాలో అప్పుడే వస్తారని తెలిపారు. ఎదురుదాడి ఎలా చెయ్యాలో కేసీఆర్‌కు తెలిసినంతగా ఇంకెవరికీ తెలియదన్నారు. నాయకుడిని నాయకుడే అంటారని.. అర్భకుడిని అర్భకుడే అంటారంటూ వ్యాఖ్యలు చేశారు. ఇలా మాట్లాడితే తనకు అహంకారం అంటారని.. కానీ తాను ఇలానే మాట్లాడుతానని.. ఏం చేసుకుంటారో చూసుకోండి అని అన్నారు. మహాభారతంలో పాండవులు హీరోలు.. విలన్లు కౌరవులు అని.. అలాగే రామాయణంలో హీరో శ్రీరాముడు... విలన్ రావణుడని తెలిపారు. ఇప్పుడు తెలంగాణ కథలో హీరో ఉన్నాడు... శకునులు, మారీచులు ఉన్నారంటూ కామెంట్స్ చేశారు. చరిత్రను మలుపు తిప్పిన రోజు కేసీఆర్ దీక్ష చేసిన రోజు అని చెప్పుకొచ్చారు. సచ్చుడో తెలంగాణ వచ్చుడో అన్న కేసీఆర్ నినాదం సునామీ సృష్టించిందన్నారు. కేసీఆర్ దీక్ష విఫలం కావాలని చాలా మంది ప్రయత్నం చేశారని ఆరోపించారు. తెలంగాణ ఉన్నంత కాలం కేసీఆర్ అనే పదాన్ని ఎవరూ తుడిచివేయలేరని స్పష్టం చేశారు. టైం బాగాలేనప్పుడు గ్రామ సింహాలు కూడా పులుల్లా గర్జిస్తాయంటూ ఎద్దేవా చేశారు. ఎన్నడూ జై తెలంగాణ అననోళ్ళు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. మొదటి నుంచి విలన్ పాత్ర పోషిస్తున్నది కాంగ్రెస్ పార్టీ అంటూ విరుచుకుపడ్డారు. పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి బైఎలక్షన్స్‌కు రావాలంటూ సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి సవాల్ విసిరారు.

# కర్నాటకలో మళ్లీ రాజకీయ సెగ

**బెంగళూరు,నవంబర్ 29 :** కర్నాటక సీఎం సిద్ధరామయ్య ఇంట్లో ఇవాళ డిప్యూసీ సీఎం డీకే శివకుమార్ బ్రేక్‌ఫాస్ట్ చేశారు. గత కొన్నాళ్ల నుంచి కర్నాటకలో అధికార మార్పిడి జరిగే అవకాశం ఉంటుందని ఊహానాగాలు వినిపిస్తున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత సంతరించు కున్నది. వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు శివకుమార్ సీఎం బాధ్యతలు అప్పగిస్తారన్న వార్తలు వ్యాపిస్తు న్నాయి.ఆ ఇద్దరు నేతల భేటీ కీలకంగా మారింది. డీకే శివకుమార్‌తో ఇవాళ బ్రేక్‌ఫాస్ట్ చేశానని సీఎం సిద్ధరామయ్య తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేశారు. కావేరి రెసిడెన్స్‌లో సీఎం సిద్ధరామయ్యతో ఉదయం అల్పహారం తీసుకున్నట్లు శివకుమార్ కూడా ట్వీట్ చేశారు. కర్నాటక ప్రభుత్వ ప్రాధాన్య తలు, ముందున్న సవాళ్ల గురించి చర్చించనున్నట్లు ఆ పోస్టులో పేర్కొన్నారు.ఉప్మా, ఇడ్లీ, కేసరీ బాత్ తింటున్న ఆ ఇద్దరు ఫోటోలు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నాయి. అయితే శివకుమార్ వైపు కాంగ్రెస్ అధిష్టానం మొగ్గుచూపుతున్నట్లు కొన్ని విశ్వాస వర్గాల ద్వారా తెలుస్తోంది. అయితే బ్రేక్‌ఫాస్ట్ భేటీలో శివ-సిద్దు ఫార్ములా బయటకు వస్తుందని కొందరు భావిస్తున్నారు.అధికార మార్పిడి జరిగే వరకు మాత్రం ఇద్దరు నేతలు తమ పదవుల్లో కొనసాగనున్నారు.

# కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)



తరలించారు. కర్ణాటక నుంచి శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం దర్శనం కోసం మంత్రాలయం వెళ్తుండగా.. కోటేకల్ గ్రామ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. వీరిని కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా చిక్కహోసల్లి గ్రామానికి చెందిన.. వెంకటేశప్ప(60), ఆయన కూతురు మీనాక్షి(32), అల్లుడు సతీశ్(36), మనవళ్లు రుత్విక్, బన్నీగౌడ్‌లుగా తేల్చారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బెంగళూరు నుంచి మంత్రాలయం వెళున్న కర్ణాటక బస్సు పత్తికొండ పరిధిలోని తుగ్గలి, రాతన గ్రామాల మధ్య బోల్తాపడింది. ఆ సమయంలో బస్సులో 29 మంది ప్రయాణికులు ఉన్నట్టు సమాచారం. వారిలో ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి.

# తీరం దాటనున్న దిత్వా తుఫాన్..

(మొదటి పేజీ తరువాయి)

అందుకని ఈ రెండు రాష్ట్రాల్లో, కేంద్రపాలిత ప్రాంతానికి భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది.బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాన్ ప్రస్తుతం ఉత్తరం, వాయువ్యం దిశగా దూసుకొస్తుంది. దాంతో.. తమిళనాడు, పుదుచ్చేరితో పాటు ఆంధ్రప్రదేశ్‌కు భారీ వర్ష సూచన పొంచి ఉంది. నవంబర్ 30న దిత్వా తుఫాన్ తీరం దాటనున్న నేపథ్యంలో రెడ్ అలర్ట్ జారీ చేసింది వాతావరణశాఖ. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించింది. వాతావరణ శాఖ హెచ్చరికలతో ఏపీ, తమిళనాడు, పుదుచ్చేరిలో జాతీయ విపత్తు నియంత్రణ బృందాలు రంగంలోకి దిగాయి.

# శ్రీలంకను ఉక్కిరిబిక్కిరి చేసిన దిత్వా..

**శ్రీలంక,నవంబర్ 29 :** దిత్వా తుఫాను శ్రీలంకను ఉక్కిరిబిక్కిరి చేసింది. తుఫాను కారణంగా భారీ వర్షాలు కురవడం, కొండచరియలు విరగిపడటం, వరదలు పోటెత్తడం లాంటి ఘటనలతో జనం ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటివరకు 123 మంది మరణించినట్లు అధికారులు తెలిపారు. మరో 100 మంది గల్లంతయ్యారు.శ్రీలంక నుంచి ఉత్తర నైరుతి దిశగా తుఫాను కదులుతోంది. భారత దేశం దక్షిణ అంచుకు సమీపంలోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ దక్షిణ తీరంపై కూడా తుఫాను ప్రభావం చూపనుంది. ఈ నెల 30 నుంచి డిసెంబర్ 4 వరకు తుఫాను కారణంగా ఏపీ దక్షిణ ప్రాంతంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.అదేవిధంగా తమిళనాడులో కూడా దిత్వా తుఫాను ప్రభావంతో రాగల 48 గంటల్లో భారీ వర్షాలు కురుస్తాయని, బలమైన గాలులు వీస్తాయని ఐఎండీ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో చెన్నై విమానాశ్రయం అధికారులు ఇప్పటికే షెడ్యూల్ అయి ఉన్న 54 విమానాలను రద్దుచేశారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు.

# భూములు అమ్ముకునే కుట్ర

**సిద్దిపేట,నవంబర్ 29 :** గ్లోబల్ సమ్మిట్ పెట్టి భూములు అమ్ముకునేందుకు రేవంత్‌రెడ్డి ప్లాన్ చేస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కేవలం రియల్ వ్యాపరమం కోసమే ఈ సమ్మిట్ అని ఆరోపణలు చేశారు. సిద్దిపేటలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ..నవంబర్ 29వ తేదీ ఒక చరిత్ర.. ఉద్యమాన్ని మలుపు తిప్పిన రోజు ఇదని చెప్పుకొచ్చారు. ఉద్యమానికి సిద్దిపేటకు అవినాభావ సంబంధం ఉందని గుర్తుచేశారు. సిద్దిపేటలో జరిగిన ఉద్యోగుల గర్జన ఒక చరిత్ర అని వివరించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష ఒక చరిత్ర.. ఎన్నో త్యాగాలతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని పేర్కొన్నారు.'తెలంగాణ రాష్ట్రం కోసం మాజీ సీఎం కేసీఆర్ పోరాడారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కేసీఆర్ పోరాటం గురించి మూర్ఖంగా మాట్లాడుతున్నారు. డిసెంబర్ 9వ తేదీ తెలంగాణ రాష్ట్ర ప్రకటన కేసీఆర్ దీక్ష ఫలితమే. మిలియన్ మార్చ్ మా వంతు.. మిలియన్‌ల కొద్దీ డబ్బు మూటలు కట్టి ఢిల్లీకి పంపుడు కాంగ్రెస్ వంతు. తెలంగాణ ఉద్యమ ద్రోహి రేవంత్‌రెడ్డికి కోదండ రామ్ దగ్గర అయ్యారు. మన నిధులు, మన నీళ్లు మనకు దక్కేలా చేసింది కేసీఆర్. హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవ రెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఇటీవల మరణించిన ఉద్యమకారుడు అందెశ్రీకి నివాళులు అర్పించారు నాయకులు. అంతకుముందు దీక్షా దివస్ సందర్భంగా సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తా నుంచి పొన్నాల బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.

# తెలంగాణలో రాజకీయ కోలాహలం

(మొదటి పేజీ తరువాయి)

సర్పంచి పదవుల కోసం 3,242 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 1,821 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. రెండో రోజు సర్పంచ్ స్థానాలకు 4901 నామినేషన్లు దాఖలు. రెండో రోజు వార్డు మెంబర్ల స్థానాలకు 9643 నామినేషన్లు దాఖలు అయినట్లు తెలిపారు. రెండు రోజుల్లో సర్పంచ్ స్థానాలకు 8198 నామినేషన్లు, 11502 వార్డు మెంబర్ నామినేషన్లు దాఖలు అయినట్లు వెల్లడించారు. మొదటి విడతలో 189 మండలాల్లోని 4,236 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహించనున్నది. 30వ తేదీన నామినేషన్ పత్రాల పరిశీలన చేపడతారు.

# ఎంత ఎత్తుకు ఎదిగినా తన మూలాలను మరవకూడదని

**- గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు ఎల్లప్పుడూ నా వంతు సహాయం అందిస్తా ఎన్ఆర్ఐ డాక్టర్ సునీల్ చౌదరి**


















**బాన్సువాడ, నవంబర్ 29(డిడి9 వార్త):** "మానవసేవయే మాధవసేవ" అనే నినాదంతో సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలని ఎన్ఆర్ఐ డాక్టర్ సునీల్ చౌదరి పిలుపునిచ్చారు. శనివారం బీర్కూరు మండలం కిష్టాపూర్ ప్రాథమిక%-%ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సుమారు 170 స్పోర్ట్స్ యూనిఫాంలు, 20 డెస్క్%-%బెంచ్‌లు, ఒక ప్రింటర్, ప్రతి విద్యార్థికి వాటర్ బాటిల్స్ అందజేశారు.ఈ మొత్తం వితరణల విలువ సుమారు రూ. 2 లక్షలు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంత ఎత్తుకు ఎదిగినా తన మూలాలను మరవకూడదని, గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు ఎల్లప్పుడూ తన వంతు సహాయం అందిస్తానని తెలిపారు. తాను బీర్కూరు మండలంలోని వెంకటప్పయ్య క్యాంపుకు చెందినవాడినని, ఇక్కడే విద్యను అభ్యసించాడని గుర్తుచేసుకున్నారు.అమెరికాలో స్థిరపడిన తర్వాత కూడా ఈ ప్రాంతం పట్ల తనకు ప్రత్యేకమైన మమకారం ఉందని, విద్యారంగంలో అవసరమైన సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. గతంలో బీర్కూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ. 10 లక్షల విలువైన కంప్యూటర్లు అందజేయడంతో పాటు, ఒక కంప్యూటర్ ఫ్యాకల్టీని నియమించి నెలవారీ వేతనం కూడా అందజేస్తున్నట్టు వెల్లడించారు. కంప్యూటర్ల నిర్వహణ, టీచర్ వేతనం చూసుకోవడం తనకు గర్వకారణమని చెప్పారు.ఉద్యోగం ప్రారంభించిన నాటి నుంచి గత 20 సంవత్సరాలుగా సంపాదనలో కొంత భాగాన్ని సమాజ సేవకు, ప్రధానంగా విద్యారంగ అభివృద్ధికి వినియోగిస్తున్నట్టు వివరించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ వేంకన్న మాట్లాడుతూ, అమెరికాలో ఉన్నా తాను చదువుకున్న పాఠశాలను మరవకుండా సేవా కార్యక్రమాలు చేయడం గొప్ప విశేషమని ప్రశంసించారు. సుమారు 60 ట్రస్టుల ద్వారా సునీల్ చౌదరి చేపడుతున్న సేవలను కొనియాడారు. దానం చేస్తే భగవంతుడు రెట్టింపు ఇస్తాడని, సమాజానికి స్ఫూర్తినిచ్చే కార్యక్రమాలు మరింత చేపట్టాలని అన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు ప్రసన్నలత, రిటైర్డ్ ఉపాధ్యాయులు మేకల విట్టల్, ఉపాధ్యాయులు రాధాకృష్ణ, దుర్గాప్రసాద్, డాక్టర్ నర్సింగ్ రెడ్డి, సునీల్ చౌదరి తల్లిగారు, ఉపాధ్యాయులు నాగరాజు, ఖాజీ, పాఠశాల బృందం, విద్యార్థులు, మాజీ ఉపసర్పంచ్ నర్సారెడ్డి, యువ నాయకులు బుజ్జిముల భాస్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త.




**(డిడి9 వార్త):** పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బిల్లులకు 707.30 కోట్లు విడుదలఉద్యోగుల సంఘాలకు హామీ ఇచ్చినట్లుగా, పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బిల్లులకు 707.30 కోట్లు విడుదల చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి మల్లు విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు.ఉప ముఖ్యమంత్రి సూచనలను అనుసరించి, ఆర్థిక శాఖ అధికారులు నవంబర్ నెలకు సంబంధించిన పెండింగ్ బిల్లులకు సంబంధించి 707.30 కోట్లు విడుదల చేశారు. ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీలో భాగంగా, ప్రతి నెలా 700 కోట్లకు పైగా విడుదల చేస్తున్నారు.దీని కొనసాగింపుగా, పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బిల్లులను క్లియర్ చేయడానికి ఆర్థిక శాఖ ఈ నెలలో ?707.30 కోట్లు విడుదల చేసింది. నవంబర్ విడుదలతో, ప్రజా ప్రభుత్వం వాగ్దానం చేసినట్లుగా వరుసగా నాలుగు నెలల ఉద్యోగుల బకాయిలను క్లియర్ చేసింది. ఈ బిల్లులలో గ్రాట్యుటీ, సరెండర్ లీవ్ మరియు వివిధ అడ్వాన్స్‌లు ఉన్నాయి.

# భారీగా కాంగ్రేస్ లో వర్ని మండల సీనియర్ బీజేపీ నేతల చేరిక

**బాన్సువాడ, నవంబర్ 29(డిడి9 వార్త):** వర్ని మండల పరిధిలోని కూనిపూర్ గ్రామానికి చెందిన బీజేపీ పార్టీకి చెందిన సీనియర్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి ఆధ్వర్యం వహించారు.శివ వర్ని, నవీన్ రెడ్డి, సతీష్, దత్తు, మహేంద్ర రెడ్డి, బాలు, ప్రవీణ్ గౌడ్, శేఖర్, గోవుర్ నరేష్ లు బాన్సువాడలోని నియోజకవర్గ కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్‌లో సభ్యత్వం స్వీకరించారు.ఈ సందర్భంగా పోచారం భాస్కర్ రెడ్డి వారిని పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వర్ని మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.






# తెగిస్తేనే వచ్చింది ఈ తెలంగాణ

**- కేసీఆర్ సచ్చుడో - తెలంగాణ వచ్చుడో నినదించిన రోజుఇది.**
**- తెలంగాణ తల్లికి నివాళులర్పించిన మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్.**







**బోథ్, నవంబర్, 29(డిడి9వార్త):-** 2001 లోతాను డిగ్రీ విద్యార్థిగా కేసీఆర్ చే జెండా కార్యక్రమం నిర్వహించారు.ఎ-ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌దీక్షా దివాస్ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన దీక్ష దివాస్కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి జోగు రామన్నతో కలిసి, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం కోసం చేసిన ఫోటో గ్యాలరీని వీక్షించి అనంతరం వారు చేసిన త్యాగాలను %ఒ% రాష్ట్రం సాధించిన తర్వాత ప్రగతిని నాయకులతో కలిసి వీక్షించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ..నాడు తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా 2009 నవంబర్ 29 న కేసీఆర్ సచ్చుడో - తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో ఆయన ఆమరణ నిరాహారదీక్ష చేసినారు.నేటికి అది 16 ఏండ్లు పూర్తి చేసుకొన్న దినమని అన్నారు. ఆనాడు కేసీఆర్ చేసిన ప్రాణ త్యాగ ప్రయత్నం వల్లనే మనకు ఈరోజు తెలంగాణ రాష్ట్రం ఏర్పడి అభివృద్ధి, ప్రగతి సాధించిందన్నారు. తెలంగాణ బీజేపీ, తెలంగాణ కాంగ్రెస్ లకు పదవులు కేసీఆర్ పెట్టిన భిక్షేనని అన్నారు. కేసీఆర్ ఉద్యమం ప్రారభించకపోయి ఉంటే ఈ కాంగ్రెస్ నాయకులను ఎవరైనా గుర్తు5పట్టేవారా?అని ప్రశ్నించారు.2001 లో కేసీఆర్ ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించినప్పుడు

# తెలంగాణ రాష్ట్ర మంత్రులను కలసిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎం.పీ గోడం నగేష్.

**బజార్ హత్నూర్, నవంబర్ 29(డిడి 9వార్త ):-** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పార్ల మెంట్ సభ్యులు గోడం నగేష్ హైదరాబాద్ లో శనివారం రోజు తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి %ఒ% రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ ని కలిశారు.ఈ సందర్భంగా ఎంపీ జి నగేష్ వారితో చర్చించి ఆదిలాబాద్ జిల్లాలోనిమిగిలిన రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన మిగిలిన పనుల ప్రతిపాదనలను వెంటనే పంపాలని కోరారు.ఎం పి నగేష్ తో పాటు బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాటిపల్లి గంగాధరరావు,మాజీ రైల్వే బోర్డు మెంబర్ జీవీ రమణ తది తరులు పాల్గొన్నారు.





# భీమ్ గల్ వేముగల్లు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం

**నిజామాబాద్ నవంబర్: 29 ( డి డి 9 వార్త)** వేముగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రోజున ఎల్.జె. గార్డెన్లో అత్యంత వైభవోపేతంగా (లయన్స్ లీడర్షిప్ ఇన్స్టిట్యూట్) కార్యక్రమాన్ని మరియు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు.?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ గవర్నర్ అమర్నాథ్ గారు హాజరై, నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ... లయన్స్ క్లబ్ సమాజ సేవలో ముందుండాలని తెలిపారుఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. లయన్స్ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. భీమ్ గల్ వేముగల్లు క్లబ్ సభ్యులు తమ సేవలను మరింత విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు.?ఈ వేడుకలో క్లబ్ నూతన అధ్యక్షుడు పడాల పురేందర్, గజ్జల చైతన్య కార్యదర్శి, ఎడ్ల శేఖర్ కోశాధికారి ,, పురస్తు బద్రి, శ్రీకాంత్, హన్మండ్లు, ప్రసాద్, లింబాద్రి, రమేష్, ధనుంజయ్, హనుమంతు, జితేందర్, శ్రీనివాస్, మధు, శ్రీనివాస్,, సాగర్ , సుధాకర్ ,శ్రీనివాస్, ఇమాన్వల్ ,వెంకటేష్ లయన్స్ క్లబ్ సభ్యులు, వారి కుటుంబ




సభ్యులు స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సాలూర మండలంలో సజావుగా సాగిన సాధారణ ఎన్నికల నామినేషన్ స్వీకరణ

**బోధన్, నిజామాబాద్ జిల్లా, నవంబర్ 29(డీడీ9 వార్త) :** రెండవ సాధారణ ఎన్నికల్లో భాగంగా సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ దరఖాస్తుల స్వీకరణ శనివారం సాలూర మండల పరిధిలో సజావుగా సాగింది. సాలూర మండల కేంద్రంలో రెండు, సాలంపాడ్ క్యాంపులో ఒకటి చొప్పున ఏర్పాటు చేసిన నామినేషన్ల కేంద్రాలలో 12 గ్రామాల సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్లు వేశారు. మొదటి రెండు రోజులు మందకొడిగా జరిగిన శనివారం చివరి రోజు కావడంతో పెద్ద సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్ల పత్రాలు సమర్పించేందుకు రావడంతో రాత్రి 10 గంటలు దాటినా దరఖాస్తుల స్వీకరణ కొనసాగింది.



## యువ పర్వతారోహకుడు భుక్య యశ్వంత్ అరుదైన శిఖరాలను అధిరోహించాడు

కామారెడ్డి, నవంబర్ 29(డిడి9 వార్త): తెలంగాణకు చెందిన యువ పర్వతారోహకుడు భుక్య యశ్వంత్ పర్వతారోహణ రంగంలో మరో మైలురాయిని అధిగమించాడు. ఆయన ఇటీవల మౌంట్ గోరిచెన్, మౌంట్ రియో పుర్గిల్‌తో పాటు అస్సాం, మణిపూర్, మిజోరామ్ రాష్ట్రాల అత్యున్నత శిఖరాలను విజయవంతంగా అధిరోహించాడు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, కఠిన మార్గదర్శకాల మధ్య ఈ శిఖరాలను అధిరోహించడం విశేషంగా నిలిచింది.యశ్వంత్ ఈ యాత్రలో తీసుకున్న అరుదైన ఫోటోలను ఎస్పీ రాజేష్ చంద్రకి అందజేశాడు. ఈ సందర్భంగా ఎస్పీ యశ్వంత్‌ను అభినందిస్తూ, ఆయన పట్టుదల, ధైర్యసాహసాలను ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని శిఖరాలను అధిరోహించేందుకు శుభాకాంక్షలు తెలిపారు.యశ్వంత్ సాధించిన ఈ విజయాలు తెలంగాణ యువతకు ప్రేరణగా నిలుస్తున్నాయి

## చిన్న మల్లారెడ్డి గ్రామ పంచాయితీ కార్యాలయంలో నామినేషన్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్





కామారెడ్డి, నవంబర్ 29(డిడి9 వార్త): జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శనివారం, జిల్లా కేంద్రంలోని చిన్న మల్లారెడ్డి గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంబంధిత అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు.కలెక్టర్ వెల్లడించినట్లయితే, ఈ నెల 27న ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ 29న మొదటి విడత ముగుస్తుంది. నామినేషన్లను సక్రమంగా స్వీకరించేందుకు అభ్యర్థులకు టోకెన్లు జారీ చేయడం, ప్రజలకు సౌకర్యవంతమైన వసతులు ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.అదేవిధంగా, ఎన్నికల నిర్వహణలో పారదర్శకత ఉండేలా, ఏ తప్పిదాలు, పొరపాట్లు లేకుండా సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నికలు సజావుగా జరగాలని కలెక్టర్ గమనించారు. నామినేషన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ద్వారా అవసరమైనవారికి సహాయసహకారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, శ్రీనివాస్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## యధావిధిగా ప్రజావాణి

**- కలెక్టరేట్ లోని 25 వ నంబర్ (ప్రజావాణి మిని సమావేశ మందిరం) లో దరఖాస్తులు స్వీకరణ**

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**

కామారెడ్డి, నవంబర్ 29(డిడి9 వార్త): ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, గ్రామ పంచాయితీ ఎన్నికల సందర్భంగా ఈ కార్యక్రమంలో కొన్ని మార్పులు చేయడం జరిగినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.సంబంధిత అధికారులందరూ ఎన్నికల విధుల్లో పాల్గొనాల్సి ఉండటం వల్ల, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఈ తాత్కాలిక మార్పులు చేపట్టినట్లు తెలిపారు.దీనికనుగుణంగా 2025 డిసెంబర్ 1, 8, 15 తేదీల సోమవారాల్లో, ప్రజల నుండి వచ్చే దరఖాస్తులను కలెక్టరేట్ లోని ప్రజావాణి మిని సమావేశ మందిరంలో స్వీకరించబడతాయని కలెక్టర్ వెల్లడించారు.గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణతో పాటు ప్రజల సమస్యలను కూడా సమర్థవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలు, వినతులను నిర్ణీత తేదీలలో సమర్పించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## కామారెడ్డి లో అంతర్జాతీయ మహిళలపై హింస నిర్మూలన దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ



కామారెడ్డి, నవంబర్ 29(డిడి9 వార్త): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కామారెడ్డి మరియు విమెన్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ ఎన్‌జీవో సంయుక్త ఆధ్వర్యంలో నేడు జిల్లా కోర్టు సముదాయంనుండి అంతర్జాతీయ మహిళలపై హింస నిర్మూలన దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించబడింది. ఈక్రమంగా ర్యాలీ ప్రారంభమవుతూ, ముఖ్య అతిథి డాక్టర్ సిఎచ్, విఆర్ఆర్ . వరప్రసాద్ గారు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు ఛైర్మన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కామారెడ్డి, మాట్లాడుతూ, “మహిళలపై హింస నిర్మూలన కోసం ప్రతి కుటుంబం, ప్రతి సంస్థ మరియు సమాజం బాధ్యతతో ముందుకు రావాలి. హింసకు గురైన ప్రతి మహిళ న్యాయ సహాయం పొందేలా న్యాయ సేవా సంస్థలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాయి. చట్టపరమైన రక్షణతో పాటు సామాజిక అవగాహన పెరిగినప్పుడే మహిళలపై హింస పూర్తిగా తగ్గుతుంది” అని తెలిపారు. అనంతరం పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.ర్యాలీని కార్యదర్శి %వీం.ు%. నాగరాణి గారు సమన్వయం చేసి విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ సుమలత, జూనియర్ సివిల్ జడ్జి కె. సుధాకర్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి దీక్షా, డబ్ల్యూవోఆర్డి మానిటరింగ్ కోఆర్డినేటర్ సోలంకీ రాణి, రమేష్ మరియు వారి సిబ్బంది, కామారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద రమేష్, జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, డిడబ్ల్యూవో సూపరింటెండెంట్ అరుణ్ భాస్కర్, కామారెడ్డి టౌన్ సీఐ నరేష్, అడ్వకేట్ శాబానా బేగం, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఎమ్ఈపిఎస్ఏ రిసోర్స్ పర్సన్స్, జిల్లా కోర్టు పరిపాలనాధికారి మంథ్య, సూపరింటెండెంట్లు జే. భుజంగరావు, వెంకట్ రెడ్డి, డిఎల్ఎస్ఏ సూపరింటెండెంట్ చంద్రసేన్ రెడ్డి, డిఎల్ఎస్ఏ సిబ్బంది, ఎన్జీఓలు, పారా లీగల్ వాలంటీర్లు, కమ్యూనిటీ మిడియేషన్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళలపై హింసకు వ్యతిరేకంగా ప్రచారో ద్యమంపై అవగాహన

**- ( ఈ సంవత్సరం థీమ్: మహిళలు అమ్మాయిలపై డిజిటల్ హింసను నిలిపేందుకు ఐక్యమవుదాం )**









బజార్హత్నూర్, నవంబర్ 29(డిడి9వార్త):- బజార్ హత్నూర్ మండలం లోని పిప్పిరిప్రాథమికపాఠశాల అంగన్వాడీ సెక్టార్ సమావేశంలో శనివారం రోజునవంబర్ 25మొదలుకొని,డిసెంబర్ 10 వ తేదీ మానవ హక్కుల దినోత్సవం వరకు 16 రోజులు ఈ కార్యక్రమంలో భాగంగా కార్యక్రమం నిర్వహించారు. నేటితో ఐదవరోజు దీనిని సఖి కేంద్రం అధ్వర్యంలో అవగాహన కల్పించారు. సఖి కేంద్రం నిర్వాహకు రాలు లావణ్య , మాట్లాడుతూ మహిళలు బాలికలపై హింసను అరికట్టేందుకు ప్రతిఒకరు ముందుండాలని ఆత్మన్యూనత భావాలకు, ఎలాంటి ప్రలోభాలకు లోనూ కాకూడదని, మహిళల, బాలికలకుసం బంధించిన చట్టాలు గృహ హింస, పోక్సో , బాల్యవివాహాల నిరోధచట్టం, పని స్థలంలో వేధింపులు, ఆర్థిక హింసలపై సోషల్ మీడియా, చాట్ యాప్స్ తప్పుడు ఫోటోలు సృష్టించడం వ్యక్తిగత సమాచారాన్ని బయట పెట్టడం లాంటి వేధింపులు జరిగినట్లయితే ధైర్యంగా చర్యలు తీసుకోవడానికి ముందు ఉండాలన్నారు.సఖీ కేంద్రం అందించే ఐదు రకాల సేవలు, హెల్ప్ లైన్ నంబర్స్ 181,1098 1930 100 గురించి వివరించారు ఈ కార్యక్రమం లో ఐసిడిఎస్ పర్యవేక్షణ అధికారులు ఉపాధ్యాయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, మహిళలు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు

# చిన్న మల్లారెడ్డిలో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్







కామారెడ్డి, నవంబర్ 29(డిడి9 వార్త): జిల్లా కేంద్రంలోని చిన్న మల్లారెడ్డి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శనివారం సందర్శించారు. వరి కొనుగోలు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన, అక్కడి అధికారుల నుండి వివరాలు తెలుసుకుని కొనుగోలు వేగాన్ని మరింత పెంచాల్సిన అవసరాన్ని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరి కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్ షీట్లు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులు, ఐకెపి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రోజు జరిగే వరి లోడింగ్‌పై పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత విభాగాలకు ఆదేశాలు ఇచ్చారు.కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ విక్టర్, సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వర్లు, డిఎమ్ శ్రీకాంత్, ఏపీఎం%-%మెప్మా శ్రీధర్ రెడ్డి తదితర అధికారులు ఈ సందర్శనలో పాల్గొన్నారు.

# కేసీఆర్ లేకుంటే తెలంగాణ లేదు రాష్ట్ర దశ దిశ మార్చింది కేసీఆర్ మాత్రమే: మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్








బాన్సువాడ, నవంబర్ 29(డిడి9 వార్త): తెలంగాణ రాష్ట్ర సాధనలో దశ%-%దిశ మార్చిన ఘనత పూర్తిగా కేసీఆర్‌కేనని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. దీక్షా దివస్ సందర్భంగా బాన్సువాడ అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, “కేసీఆర్ లేకుంటే తెలంగాణ లేదు” అని గుర్తుచేశారు. అంతకు ముందు బీఆర్ఎస్ కార్యకర్తలతో కలసి ర్యాలీగా వెళ్లి అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. బాజిరెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పది ఏళ్ల పాలన రాష్ట్రాన్ని దేశంలో అగ్రస్థానానికి తీసుకెళ్లిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా విఫలమైందని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలుకాని హామీలు మాత్రమే ఇచ్చి ప్రజలను నిరాశపర్చిందని విమర్శించారు.బాన్సువాడకు కేసీఆర్ అత్యధిక నిధులు కేటాయించారని, ఇకపై బీఆర్ఎస్ ప్రభుత్వమే ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం రెండు సంవత్సరాల్లోనే రూ. 2.50 లక్షల కోట్ల అప్పులు చేసిందని ఆరోపించారు.కార్యక్రమంలో అంజిరెడ్డి, జుబేర్, మోచి గణేష్, సాయిబాబా, రమేష్ యాదవ్, నాయిని మొగులయ్య, బోడ చందర్, శివసూరి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# 42 శాతం బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌ను వెంటాడుతాం

**హైదరాబాద్:** విద్యా, ఉద్యోగాలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతామని తెలంగాణ బీసీ జేఏసీ చైర్మన్, ఎంపీ ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. శుక్రవారం గన్‌పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద జేఏసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులు, యువజన, బీసీ కుల సంఘాల ప్రతినిధులతో కలిసి ఆర్.కృష్ణయ్య నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ. 42శాతం రిజర్వేషన్లపై ప్రతి దశలోనూ సీఎం రేవంత్ ప్రభుత్వం విఫలమైందన్నారు. పంచాయతీ ఎన్నికల్లో జీఓ46ను తీసుకొచ్చి బీసీలను ప్రభుత్వం దగా చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.



రానున్న పార్లమెంటు సమావేశాల్లో 42శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించేలా త్వరలో తాము ప్రధాని నరేంద్రమోదీని కలిసి విన్నవిస్తామన్నారు. బీసీ రిజర్వేషన్లపై త్వరలో పరేడ్‌మైదానంలో లక్షలాది మందితో కలిసి భారీ బహిరంగ సభను నిర్వహిస్తామన్నారు. తద్వారా కాంగ్రెస్ సర్కారును ఎండగడతామన్నారు. అప్పటికీ స్పందించని పక్షంలో ఢిల్లీలోని జంతర్‌మంత్ వద్ద ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, డాక్టర్ అరుణ్‌కుమార్, బీసీ రాష్ట్ర ప్రతినిధులు కొండా దేవన్న, నీలా వెంకటేశ్, భూమన్నగౌడ్, గుజ్జ సత్యం, రాజేందర్, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో మరిన్ని ఇందిరమ్మ క్యాంటీన్లు

**హైదరాబాద్:** నగరానికి ఉపాధికోసం వచ్చే కార్మికులకు ఇందిరమ్మ క్యాంటీన్లు ఎంతగానో దోహదపడ్డాయని, ఈ క్యాంటీన్లను నిరుపేద ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ కోరారు. కవాడిగూడ కల్పన థియేటర్ వద్ద, బాగ్‌లింగంపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ క్యాంటీన్‌లను శుక్రవారం మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరిన్ని ఇందిరమ్మ క్యాంటీన్లను విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. అలాగే పొదుపు మహిళా సభ్యులు మరిన్ని గ్రూపులు పెంచాలని, త్వరలో వడ్డీలేని బ్యాంక్ రుణాలు ఇప్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. భవిష్యత్‌లో ఇందిరమ్మ క్యాంటీన్లను మహిళా పొదుపు గ్రూపు సభ్యులకు అప్పగించి, వారి ఆర్థిక స్వావలంభనకు తోడ్పాడుటును అందిస్తామని తెలిపారు. మేయర్




గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ నగరంలో అవసరమైన చోట ఇందిరమ్మ క్యాంటీన్లు ఏర్పాటు చేసి పేదల ఆకలి తీర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ నగరంలోని పేదల ఆకలి తీర్చడానికి గత ప్రభుత్వం ప్రారంభించిన భోజన కేంద్రాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా క్యాంటీన్ల వద్ద కార్మికులు, ప్రజలతో కలిసి మంత్రి పొన్నం, మేయర్, ఎమ్మెల్యే, ఎంపీ అల్పాహారం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి, కార్పొరేటర్లు జి.రచనశ్రీ, కె.రవిచారి, గౌసుద్దీన్, బీఆర్‌ఎస్ నాయకులు ముఠాజైసింహ, బీజేపీ నాయకులు జి.వెంకటేష్, మాజీ కార్పొరేటర్లు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాల నేలమట్టం

**హైదరాబాద్ :** ఎన్నిసార్లు చెప్పినా వినరు.. మాకెవరు అడ్డురాగలరు అన్నట్లుగా కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూములను, నీటి వనరుల ఆక్రమణకు ప్రయత్నిస్తుంటారు. అధికారుల అండదండలు ఉన్నాయన్న ధీమాతో.. చట్టాలను ఏమాత్రం లెక్కచేయకుండా అక్రమ కట్టడాలను నిర్మిస్తుంటారు. ఇటువంటి వాటిని అధికారులు ఉపేక్షించరు. చట్టాన్ని ఉల్లంఘించేవారిపై ఉక్కుపాదం మోపుతూ.. తాజాగా రెవెన్యూ, హెచ్‌ఎండీఏ అధికారులు భారీగా కూల్చివేతలు చేపట్టారు. తెలంగాణలో ప్రభుత్వ భూముల కబ్జాకు పాల్పడేవారిపై రెవెన్యూ అధికారులు తమ దూకుడును పెంచారు. జవహర్ నగర్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన కూల్చివేతలు ఈ తీవ్రతను తెలియజేస్తున్నాయి. కాప్రా తహసీల్దార్ రాజేష్ ఆధ్వర్యంలో పలు సర్వే నెంబర్లలోని అక్రమ కట్టడాలను పోలీస్ పహారా మధ్య నేలమట్టం చేశారు. సర్వే నెం. 376, 377, 293, 202, 203/1, 710, 421, 812 వంటి కీలకమైన ప్రభుత్వ భూముల్లోని అక్రమ నిర్మాణాలను జేసీబీల సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజేష్ మాట్లాడుతూ.. జవహర్ నగర్ కార్పొరేషన్‌లోని సర్కారు భూముల్లో ఎలాంటి కొత్త నిర్మాణాలు చేపట్టరాదని.. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తీవ్రంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రమేష్, సత్యనారాయణ, జవహర్ నగర్ ఎస్సైలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. కూకట్‌పల్లి నల్ల చెరువులో ఉద్రిక్తతమరోవైపు.. కూకట్‌పల్లిలోని నల్ల చెరువు పరిరక్షణలో భాగంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న గుడిసెలను హైడ్రా



అధికారులు కూల్చివేశారు. ఈ కూల్చివేత సందర్భంగా ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న తమ గుడిసెలను ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా కూలుస్తున్నారంటూ స్థానికులు హైడ్రా అధికారులను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. తాము దళితులమని.. గత 50 ఏళ్లుగా ఇదే కాలనీలో నివాసం ఉంటున్నామని.. ఇది తాత ముత్తాతల నుంచి వస్తున్న ప్రభుత్వ భూమి అని.. ఇది ప్రభుత్వా నికి సంబంధించి కాదనీ స్థానికులు ఆందోళనకు దిగారు. తమ భూములను లాక్కుంటే ఆత్మహత్యలకు పాల్పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది నల్ల చెరువులో కూల్చివేతల భయంతో బుచ్చమ్మ అనే మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేస్తూ.. హైడ్రా సిబ్బందిని నిలదీశారు. అయితే.. స్థానికుల ఆందోళన ఉన్నప్పటికీ.. భారీ పోలీసు బందోబస్తు మధ్య హైడ్రా అధికారులు కూల్చివేత కొనసాగించి.. గుడిసెలను తొలగించారు.

# తెలంగాణకు చరిత్ర కేసీఆర్

**భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 29 :** తెలంగాణ చరిత్ర కేసీఆర్ అని, దానిని ఎవరు చెరపలేరని బీఆర్‌ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం బీఆర్‌ఎస్ పార్టీ ఆఫీస్‌లో శనివారం నిర్వహించిన దీక్ష దివస్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా ప్రగతి మైదానంలో అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి, తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాధనలో సింగరేణి కార్మికులు కూడా కీలక పాత్ర పోషించారన్నారు. నాడు కేసార్ తెచ్చిన తెలంగాణ వల్లే నేడు ఎంతో మంది నాయకులు ప్రజా ప్రతినిధులుగా పదవులు అనుభవిస్తున్నారని అది కాంగ్రెస్ నాయకులు తెలుసుకోవాలన్నారు. కేసీఆర్ లేని తెలంగాణ ఎవరూ చూడలేరన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. బీసీలను మోసం చేసి రిజర్వేషన్లకి అడ్డుపడ్డారని దమ్ముంటే



ఎంపీటీసీ ఎన్నికలకైనా బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చూపెడతామని, అందుకు కార్యకర్తలంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ.. కేసీఆర్ చేసిన అంకుటిత దీక్ష వల్లే మనకు తెలంగాణ వచ్చిందన్నారు. ఎంతోమంది నాయకులు తెలంగాణ కోసం కష్టపడినా చివరికి సాధించలేకపోయారని, కానీ అది కేసీఆర్ వల్లే సాధ్యమైందన్నారు. కేసీఆర్ తెలంగాణ తీసుకురావడం వల్లే ఈరోజు ముఖ్యమంత్రి స్థానంలో రేవంత్ రెడ్డి ఉన్నారని, లేకుంటే ఇలాంటి పదవులు వచ్చేవా అని ఆయన ప్రశ్నించారు. మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చ నాగేశ్వర్‌రావు, హరిప్రియ, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు దిండిగల రాజేందర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ఉద్యమం, తెలంగాణ సాధన గురించి ప్రస్తావించారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చూపెడతామని హామీ ఇచ్చారు. అనంతరం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్ర మంలో భద్రాచలం ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్, పాల్వంచ నాయకులు మంతపురి రాజు గౌడ్, కొట్టి వెంకటేశ్వర్లు, కాంపెల్లి కనకేశ్, సింధు, తపస్వి, సంకుబాపన అనుదీప్, బత్తుల వీరయ్య, పొగరు రాజశేఖర్, నవతన్, మాజీ ఎంపీపీలు సోనా, బాధావత్ శాంతి, అరుణ పాల్గొన్నారు.

# దుష్ట చతుష్టయానికి లై డిటెక్టర్ పరీక్షలు చేస్తే నిజాలన్నీ బయటకు వస్తయ్

**హైదరాబాద్, నవంబర్ 29:** దుష్ట చతుష్టయానికి లై డిటెక్టర్ టెస్ట్ చేస్తే హిల్ట్ పాలసీలో నిజాలన్నీ బయటకు వస్తయ్ బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. హిల్ట్ పాలసీపై చర్చకు రావాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సవాల్ విసిరిన బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పూర్తి ఆధారాలతో శనివారం పలు ఫైల్స్‌తో మీడియా పాయింట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా చర్చల కోసం ఏర్పాట్లు చేసి మంత్రి కోసం నిరీక్షించారు. ఈ సందర్భంగా కొంత సేపు హైడ్రామా చోటు చేసుకుంది. రూ. 6.30లక్షల కోట్లు కొల్లగొట్టేందుకు రాత్రికి రాత్రే ప్రభుత్వం జీవోను తీసుకువచ్చిందని.. చెప్పినట్లుగానే రుజువు చేసేందుకు అసెంబ్లీలో ఫైల్స్‌కు తీసుకువచ్చానన్నారు. అయితే, చైర్లకు వేసిన మంత్రుల ప్లేర్లను అసెంబ్లీ సిబ్బంది తొలగించారు. దాంతో ఉత్తమ్, భట్టి ఎప్పుడు వస్తారో కనుక్కొని చెప్పాలని సిబ్బందికి చెప్పగా. తమకు సంబంధం లేదని చెప్పి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ నాయకులకు అవగాహన లేదని చెప్పిన ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఛాలెంజ్ చేస్తే చర్చకు రాలేదని విమర్శించారు. భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు కూడా ఎవరూ రాలేదన్నారు. సబ్ కమిటీ వేస్తే మినిట్స్, దాని విషయాలు బయటప ఎట్టారా? అంటూ



ప్రశ్నించారు. దుష్ట చతుష్టయం (భట్టి, శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి) లై డిటెక్టర్ టెస్టులు చేస్తే అవే నిజాలు బయటకు వస్తాయన్నారు. దీనిపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేస్తే ఎవరూ రాలేదన్నారు. గతంలో ఇండస్ట్రియల్ కోసం కేటాయించిన భూములను మాయం చేస్తున్నారని.. గతంలో ఎవరికి అలకేట్ చేశారో వాళ్లకే దారాదత్తం చెయ్యడం వెనక ఉద్దేశం ఏంటో ప్రభుత్వం చెప్పాలన్నారు. స్వార్థం కోసం లక్షల కోట్ల ప్రభుత్వ ధనం కొల్లగొడుతున్నారని.. కేంద్ర అధిష్టానానికి కమిషన్ ఇవ్వడం కోసమే ఈ స్కామ్‌కు తెరలేపారని.. దీనిపై బీజేపీ పోరాడుతుందన్నారు. నిజంగా ప్రభుత్వం ప్రజల మేలు కోరేదైతే రూ. 6,30,000 కోట్ల ఆస్తిని కేవలం రూ. 5వేల కోట్లకు ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించారు. రాత్రికి రాత్రే దొంగలా ఎందుకు జీవోను తీసుకువచ్చారని నిలదీశారు. సబ్ కమిటీ నిర్ణయం తీసుకుంటే సిఫారసు ప్రకారం ఎందుకు ముందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. ఇండస్ట్రియల్ ఏరియాలో ప్రజలు ఆవాసాలు ఏర్పరచుకుంటే.. అక్కడ ఉన్న కెమికల్ వ్యర్థాల కారణంగా ప్రజలకు నష్టం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి ఒక రియల్టర్‌గా, మంత్రులు మోసగాళ్లలా వ్యవహరిస్తున్నారని.. ప్రజాస్వామ్యంలో చర్చకు తావివ్వకుండా ప్రజల ఆస్తి కొల్లగొట్టడం అప్రజాస్వామికమన్నారు. హిల్ట్‌పై ఛాలెంజ్ చేస్తే ఎందుకు చర్చకు ఒక్క వ్యక్తి రాలేదని.. అంటే తప్పు ఒప్పుకున ట్లేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుంభకోణాలపై ప్రశ్నించాలని రాష్ట్రంలోని ఎమ్మెల్యేలను కోరారు.

# పది పై పరేషాన్ ఆ టీచర్లకు పరీక్షే

**హైదరాబాద్ :** పదో తరగతి పరీక్షలు జిల్లాలోని ప్రైవేట్ ఉపాధ్యాయులకు సవాల్‌గా మారాయి. ప్రతి సబ్జెక్టులో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని పలు విద్యాసంస్థల యాజమాన్యాలు ఆదేశాలు జారీచే స్తున్న తరుణంలో టీచర్లు సతమతమవుతున్నారు. తరగతి గదిలో పాఠాలు బోధిస్తుండడంతోపాటు విద్యార్థులు ఇంటికి వెళ్లిన తర్వాత వారితో ఫోన్‌లో మాట్లాడడం, సందేహాలను నివృత్తి చేయడం లాంటివి చేస్తుండడం ఆసక్తికరంగా మారింది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి వార్షిక పరీక్షల షెడ్యూల్‌ను ఎస్‌ఎస్‌సీ బోర్డు కొన్ని రోజుల క్రితం విడుదల చేసింది. వచ్చే ఏడాది మార్చి 27 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో అటు పాఠశాలలో, ఇటు ఇంటిలో విద్యార్థులపై టీచర్లు, తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించారు. సబ్జెక్టుల్లో ఫెయిలైతే చర్యలు పదో తరగతి పరీక్షలు విద్యార్థుల కంటే వారికి పాఠాలు బోధించే టీచర్లకే సవాల్‌గా మారినట్లు కనిపిస్తోంది. ఇందుకు పలు పాఠశాలల్లో యాజమాన్యాలు పెడుతున్న కండీషన్లే ఉదాహరణగా నిలుస్తున్నాయి. సబ్జెక్టుల్లో వందశాతం పాస్‌కావడంతో పాటు విద్యార్థులు బైకి బై మార్కులు సాధించేందుకు కృషి చేసిన టీచర్లకు ప్రత్యేక బహుమతులు ఇస్తామని, వేతనాల పెంపు కచ్చితంగా చేస్తామని హామీ ఇస్తున్నారు. విద్యార్థులు ఫెయిలైతే అందుకు బాధ్యులను చేస్తూ చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నట్లు తెలిసింది. ప్రైవేట్ టీచర్లకు ఆయా యాజమాన్యాలు జారీ చేసిన హెచ్చరికల మాదిరిగానే విద్యాశాఖాధికారులూ సర్కారు ఉపాధ్యాయులకు సూచిస్తున్నారు. పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలన్నారు.




# కేసీఆర్ అన్ని పార్టీలతో జై తెలంగాణ అనిపించారు

**హైదరాబాద్ :** తెలంగాణ భవన్‌లో జరిగిన దీక్షా దివస్ వేడుకల్లో మాజీ మంత్రి , ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ నేతలు, శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి, జయశంకర్ సార్‌కు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుదూ. .అహిం సా మార్గంలో గాంధీ దేశానికి స్వాతం త్ర్యం తీసుకొచ్చారు. ప్రత్యేక రాష్ట్రం తీసుకు రావడం ఒక చరిత్ర. 1969 లోనే తెలం గాణ ఉద్యమం పురుడుపోసుకుంది . 2001లో కేసీఆర్ నాయకత్వంలో ఏర్పాటై న బీఆర్‌ఎస్ పార్టీతోనే తెలంగాణ ఏర్పడిం దన్నారు. తెలంగాణ సాధించాలనే సంకల్పం, చిత్తశుద్ధితో కేసీఆర్ పోరాడా రు. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి మన రాష్ట్రం తెలంగాణ సాధించుకోవాలనే తపనతో కేసీఆర్ పోరాడారు. కేసీఆర్ అన్ని పార్టీలతో జై తెలంగాణ అనిపించారు. కేసీఆర్ పుణ్యంతోనే అనేకమందికి పదవులు వరించాయని%ా% అవి కేసీఆర్ భిక్ష అని అన్నారు. కేసీఆర్ భిక్ష అని మర్చిపోకండి. కేసీఆర్ నిర్మించిన సెక్రటేరియట్, కమాండ్ కంట్రోల్ సెంటల్, ప్రగతి భవన్‌లో ఎలా ఉంటున్నారని ప్రశ్నించారు. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌ది. పేదల ఆకలి తీర్చాలని అన్నపూర్ణ కేంద్రాలను ప్రారంభిస్తే.. ఇందిరా క్యాంటీన్లుగా మార్చారు. కేసీఆర్ ప్రభుత్వం బతుకమ్మ చీరలు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ చీరలు పేరుతో పంచుతుంది. మీరు ఇప్పుడు ఎక్కిన గద్దెలు, పదవులు కేసీఆర్ భిక్ష అని మర్చిపోకండని హితవు పలికారు. కేసీఆర్ ప్రాణత్యాగానికి పాల్పడితే తెలంగాణ వచ్చింది. మా నీళ్లు, నిధులు, నియామకాలు మాకే కావాలి అంటూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో అనేక అభివృద్ధి పనులు చేసుకున్నాం. కేసీఆర్ మళ్లీ రావాలి.. అని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు కేసీఆర్ ఒక చరిత్ర . మాయ మాటలు, మోసం హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, కాంగ్రెస్ అన్నింటా విఫలమైందని మండిపడ్డారు.



# డాక్టర్‌ను ట్రాప్ చేసిన సైబర్ కేటుగాళ్లు రూ.14 కోట్లు స్వాహా

**హైదరాబాద్, నవంబర్ 29:** సైబర్ నేరగాళ్ల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. సైబర్ మోసాలను అడ్డుకునేందుకు పోలీసులు ఎన్నో రకాలు చర్యలు తీసుకున్నప్పటికీ సైబర్ నేరగాళ్లు తమ పని తాము చేసుకుపో తూనే ఉన్నారు. ప్రజలను మోసం చేస్తూ భారీగా డబ్బులను కొట్టేస్తున్నారు. తమ మాయ మాటలతో ప్రజల బ్యాంకు ఖాతాల్లోని డబ్బులను ఈజీగా సొంతం చేసుకుంటున్నారు. యాప్‌లను, కొత్త లింక్‌లను ఓపెన్ చేయొద్దని, ఓటీపీలు చెప్పవద్దని పోలీసులు పదే పదే చెబుతున్నారు. అయినా కూడా సైబర్ నేరగాళ్లు రోజుకో రకం మోసాలకు తెరతీస్తున్నారు. తాజాగా తెలంగాణలో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. ఓ డాక్టర్.. సైబర్ నేరగాళ్ల వలలో పడి పెద్ద మొత్తంలో నగదును పోగుట్టుకున్నాడు. వివరాల్లోకి వెళ్లితే. మొదట డాక్టర్ దానిని పట్టించుకోకపోవడంతో ట్యాక్స్ పే చేయాల్సిందే అంటూ అతడిపై సైబర్ నేరగాళ్లు తీవ్ర ఒత్తడి తీసుకొచ్చారు. ఇక డబ్బులు భారీగా వస్తాయంటే ఎవరు ఊరుకుంటారు చెప్పండి. అలాగే డాక్టర్ కూడా వచ్చే డబ్బు కోసం ఉన్న డబ్బును సైబర్ నేరగాళ్లకు దారాదత్తం చేశాడు. తాను ట్యాక్స్ పే చేసినప్పటికీ అవతలి నుంచి ఎలాంటి నగదు రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించాడు. వెంటనే సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన సైబర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. డాక్టర్‌కు వచ్చిన మెసేజ్ ఎక్కడి నుంచి వచ్చింది?... ఎవరు పంపారు? అనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఏది ఏమైనా సైబర్ నేరగాళ్ల వలలో పడి భారీ మొత్తంలో నగదును పోగుట్టుకోవద్దని ప్రజలకు సైబర్ పోలీసులు మరోసారి హెచ్చరించారు.



# ఐబొమ్మలన్నీ అక్కడి నుంచి తీసుకున్నవే గుట్టు విప్పేసిన రవి

**హైదరాబాద్:** ఐబొమ్మ రవి రెండో విడత కస్టడీ ముగిసింది. ఈ క్రమంలో అతను పోలీసుల ముందు సంచలన విషయాలు వెల్లడించాడు. రవి మెయిల్ అకౌంట్స్ రిట్రైవ్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు.. ఐబొమ్మ, బప్పం వెబ్‌సైట్స్‌లో 21వేలకు పైగా సినిమాలను గుర్తించారు. పైరసీ వెబ్‌సైట్స్ నుంచి సినిమాలు రికార్డింగ్ చేసినట్టు గుర్తించారు. ఓటీటీలో వచ్చే సినిమాలను కూడా రికార్డింగ్ చేసినట్టు రవి అంగీకరించినట్లు తెలిసింది. రికార్డింగ్ చేసిన ఆడియోలు, వీడియోల క్వాలిటీ పెంచేందుకు.. కరేబియన్ దీవుల్లో ఔట్‌సోర్సింగ్ వారితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. పైరసీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ గురించి రవి పోలీసులకు వివరించాడు. తాను నిర్వహించిన వెబ్‌సైట్లపై కూడా క్లారిటీ ఇచ్చాడు. ఐబొమ్మ పూర్తిపేరు ఇంటర్నెట్ బొమ్మగా వెల్లడించాడు. విశాఖలో సినిమాను బొమ్మగా పిలిచేవాళ్లమని.. బొమ్మను ఇంటర్నెట్‌లో చూపిస్తున్నందుకే ఐబొమ్మ అని పేరు పెట్టినట్లు చెప్పాడు. మరో వెబ్‌సైట్‌కు బలపం పేరు పెట్టాలని భావించినట్లు తెలిపాడు. అయితే డొమైన్‌లో సాంకేతిక సమస్యతో %ా% అక్షరం తీసి బప్పంగా మార్చినట్లు వివరించాడు. తాను అప్‌లోడ్ చేసిన సినిమాలన్నీ టెలిగ్రామ్ నుంచి తీసుకున్నవే అని రవి అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.



## ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ పదవీకాలం పొడిగింపు




**అమరావతి, నవంబర్ 29:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పదవి కాలం మరో మూడు నెలలు పొడిగిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి ఈ నెలాఖరుతో విజయానంద్ పదవీకాలం ముగియనుంది. అయితే, అతని పదవీకాలం మరో మూడు నెలలు పొడిగించాలని కోరుతూ కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసిందిఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పదవి కాలాన్ని కేంద్రం మరో మూడు నెలలు పొడిగించింది. కొద్దిసేపటి క్రితం దీనికి సంబంధించిన ఉత్తర్వులను కేంద్రం జారీ చేసిందిఆంధ్రప్రదేశ్ ఎనర్జీ రంగంలో 14 సంవత్సరాల అనుభవం కలిగిన అధికారి విజయానంద్. 2024 డిసెంబర్‌లో ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఆయన, 'ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024' రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ పాలసీ రాష్ట్రాన్ని 160 రెన్యూవబుల్ ఎనర్జీ హబ్‌గా మార్చే లక్ష్యాన్ని పెట్టుకుంది. అలాగే, తుఫానుల సమయంలో ఎనర్జీ సరఫరాను నిర్వహించడంలో ఆయన తీరుకు ప్రశంసలు అందుకున్నారు.

## విశాఖకు గూగుల్ పెద్ద గేమ్ ఛేంజర్



**తిరుమల:** విశాఖపట్నంకు గూగుల్ సంస్థ రావడంతో పెద్ద గేమ్ ఛేంజర్‌గా మారబోతోందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుఅన్నారు. సినీనటులు శ్రీకాంత్, అశోక్‌తో కలిసి శుక్రవారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ... గతంలో మైక్రోసాఫ్ట్ సంస్థ హైదరాబాద్‌కు వచ్చినప్పుడు అద్భుతమైన మార్పులు జరిగాయని గుర్తు చేశారు. సైబరాబాద్ వంటి నగరం ఏర్పాటు కావడంలో మైక్రోసాఫ్ట్ కీలకంగా వ్యవహరించిందన్నారు.ఇదే తరహాలో గూగుల్ రాకతో విశాఖపట్నం కూడా ప్రపంచగుర్తింపు నగరంగా అభివృద్ధి చెందబోతోందన్నారు. రిలయన్స్, టీసీఎస్ వంటి అనేక సంస్థలు విశాఖవైపు చూస్తున్నాయన్నారు. కాగా, ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

## తిరుమల శ్రీవారి ఆదాయం ఎంతంటే



**తిరుమల :** కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వరస్వామి కొలువుదీరిన తిరుమల ( ) లో భక్తుల రద్దీ కొనసాగుతుంది. నిన్న వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిదర్శనానికి 18 కంపార్టుమెంట్లలో వ వేచి ఉన్నారు. టోకెన్లు లేని భక్తులకు 10 గంటల్లో సర్వదర్శనం ( అవుతుందని ఆలయ అధికారులు వివరించారు.శుక్రవారం 70,044 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా 25,559 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.47 కోట్లు ఆదాయం వచ్చిందని వెల్లడించారు.అన్నప్రసాదం ట్రస్టుకు రూ. కోటి విరాళం ..తెనాలికి చెందిన రామకృష్ణ కిలారి అనే భక్తుడు టీటీడీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ. కోటి విరాళం గా అందించారు. ఈ మేరకు దాత తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలోఅదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు.

## సీపీఎం నేత పెంచలయ్య హత్య కేసు



**నెల్లూరు, నవంబరు29 :** సీపీఎం నేత పెంచలయ్య హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రజానాట్యమండలి రూరల్ డివిజన్ అధ్యక్షుడుగా పనిచేస్తున్నారు పెంచలయ్య. ఈ కేసుకు సంబంధించి నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు కీలక విషయాలు వెల్లడించారు. పెంచలయ్య తన కుమారుడితో కలిసి బైకుపై వెళ్తుండగా పది మంది అటకాయించారని.. వారం దరూ మూడు బైకులతో వెంబడించారని తెలిపారు. పాతకక్షలు, గంజాయికి వ్యతిరేకంగా పెంచలయ్య పోరాటం చేశారని గుర్తుచేశారు. అలాగే ఓ ఆలయ నిర్వాహణపై గొడవలు కూడా ఆయన హత్యకు కారణమని వివరించారు. అరవ కామాక్షమ్మతో పాటు నిందితులపై రౌడీషీట్లు, పాత కేసులు ఉన్నాయని తెలిపారు. ఆ కేసుల్లో వారికి బెయిల్ రద్దు అయ్యేలా చూస్తామని చెప్పుకొచ్చారు. ఓ నిందితుడు జేమ్స్ కత్తితో పోలీసులపై దాడి చేశారని.. ఈ క్రమంలో ఆదినారాయణ అనే పోలీసు కానిస్టేబుల్‌కు తీవ్రగాయమైందని తెలిపారు. త్రుటిలో ఆయనకు ప్రాణాపాయం తప్పిందని అన్నారు. నిందితుడు నుంచి ప్రాణాలను రక్షించుకునే క్రమంలో సీఐ వేణు మొదట ఒక రౌండ్ గాల్లోకి కాల్పులు జరిపారని నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు.కామాక్షమ్మపై పలు కేసులు.'పెంచలయ్య కేసులో వైసీపీ నేత అరవ కామాక్షమ్మ, ఆమె గ్యాంగు ఉన్నారు. వైసీపీలో అరవ కామాక్షమ్మ, ఆమె గ్యాంగ్ సభ్యులు కీలక భూమిక పోషించారు. కామాక్షమ్మపై గతంలో హత్యాయత్నం, గంజాయి, ఇళ్లల్లో, రైల్వేలో దొంగతనాల కేసులు, రౌడీషీట్స్ ఉన్నాయి. వైసీపీ ఎస్సీ సెల్ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి సహకారంతో కామాక్షమ్మ నేరాలకు పాల్పడుతున్నారు. కామాక్షమ్మ యాక్షన్ ప్లాన్‌ను ముఖ్య అనుచరుడు జేమ్స్ అమలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే కామాక్షమ్మ గ్యాంగ్, వైసీపీ నేత పాలకీర్తి రవి అరాచకాలను గట్టిగా పెంచలయ్య నిలదీశారు. వారి అరాచకాలను నిలదీయడంతో నెల రోజుల వ్యవధిలోనే పెంచలయ్యని దారుణంగా హత్య చేశారు. గంజాయి విక్రయాలు, వినియోగాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు పెంచలయ్య. ఆయన హత్య కేసులో నిందితులుగా వైసీపీ నేతలు కామాక్షమ్మ, రవి, జేమ్స్, మరికొందరు ఉన్నారు' అని నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.హత్యకు గురైన పెంచలయ్య మృతదేహాన్ని నెల్లూరు జీజీహెచ్‌లో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు కోటంరెడ్డి. సీపీఎం పార్టీతో పాటు, తాము పెంచలయ్య కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

## వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాం



**అమరావతి, నవంబర్ 29:** సీఎం చంద్రబాబు సూచనల మేరకు రాజధాని రైతులపై త్రిసభ్య కమిటీ సమావేశం జరిగిందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.(శనివారం) రాయపూడి సీఆర్డీఏ కార్యాలయంలో రాజధాని రైతు కమిటీ సభ్యులు, సీఆర్డీఏ అధికారులతో త్రీ మెన్ కమిటీ సభ్యులు భేటీ అయ్యారు. రాజధాని రైతుల సమస్యలపై చర్చించారు. అనంతరం కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. 1286 ప్లాట్లకు వీధి పోటు సమస్యలు ఉన్నాయని.. వాస్తు ప్రకారం కొన్ని ఇబ్బందులు వచ్చాయని తెలిపారు.156 మంది రైతులకు వాస్తు ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. ఒక వేళ వాస్తు బాలేని రైతులు తమకు వేరే చోట కావాలని చెప్తే కేటాయిస్తారని అన్నారు. రైతులకు పెన్షన్, హెల్త్ కార్డు సమస్యలు ఉన్నాయని.. ఒక నెలలోనే పరిష్కారం అవుతాయని వెల్లడించారు. లంక భూములు, అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టామన్నారు. భూ త్యాగాలు చేసిన రైతుల సమస్యలు పరిష్కరించకుండా డబ్బులు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సీఆర్డీఏ అధికారులు, సిబ్బందిపై వస్తున్న ఫిర్యాదులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో అవినీతి నిర్మూలనకు ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. త్వరలోనే ఆ దిశగా కార్యచరణ రూపొందిస్తామని ప్రకటించారు. రైతు సమస్యల పరిష్కారంలో తొలుత కొంత గ్యాప్ వచ్చిందని.. అయితే తనతో సమావేశం తర్వాత అన్నింటిపైనా స్పష్టత వచ్చిందని వెల్లడించారు.రైతులు కూడా ఆనందంగా ఉన్నారన్నారు. రెండో దశ భూ సమీకరణ ఉపయోగాలపై రైతులకు వివరించినట్లు చెప్పారు. మునిస్పాలిటీగా అమరావతి మిగిలిపోకుండా మహానగరంగా అభివృద్ధి చెందితే ఎలాంటి ఫలితాలు ఉంటాయో రైతులు అర్థం చేసుకున్నారన్నారు.అసైన్డ్ ల్యాండ్‌ను మిగిలిన భూములతో సెపరేట్ చేసి క్యాబినెట్‌లో చర్చిస్తామని అన్నారు. ప్రతి రెండు వారాలకు అందరి రైతుల సమస్యలు వింటామని కేంద్రమంత్రి పెమ్మసాని తెలిపారు.ఆ భూముల విషయంలో ఇబ్బంది లేదు: నారాయణ అమరావతి రాజధాని రైతుల సమస్యలను త్రి సభ్య కమిటీ ఎప్పటికప్పుడు తెలుసుకుం టోందని మంత్రి నారాయణ అన్నారు. గ్రామ కంఠాల్లో ఇచ్చిన భూములు, జరీబు, నాన్ జరీబు అన్ని భూములపై దృష్టి పెడతామని చెప్పారు. వచ్చే క్యాబినెట్‌లో అసైన్డ్ భూములు, లంక భూములపై చర్చించను న్నట్లు తెలిపారు. అమరావతి రాజధాని గ్రామాల్లో హెచ్‌డీ లైన్స్, ఇతర మౌలిక వసతులపై దృష్టి పెట్టామన్నారు. గ్రామకంఠాల్లో ఎవరికైతే ప్లాట్లు ఇచ్చారో వాటిపై ఉన్న అనుమానాల నేపథ్యంలో అన్ని వెరిఫై చేయమని అధికారులకు చెప్పినట్లు తెలిపారు.లంక భూముల విషయంలో ప్రస్తుతానికి ఇబ్బంది లేదన్నారు. ఆర్ అండ్ బి రోడ్‌లకు సంబంధించి పరిహారం తక్షణం వచ్చేలా సీఆర్డీఏ చూస్తుందన్నారు. ఆర్ అండ్ బి ఇవ్వాల్సిన పరిహారాన్ని సీఆర్డీఏ ముందుగా చెల్లిస్తుందన్నారు. ఉదయం 9 గంటలకు సమావేశమంటూ సమయమిచ్చామని.. అయితే కొందరు రైతుల ఆలస్యంగా వచ్చారని తెలిపారు. వచ్చే సమావేశం నాటికి అందరినీ పిలుస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

## ఆ జిల్లాలను అలర్ట్ చేయండి దిత్వా తుఫానుపై అధికారులతో హోంమంత్రి



అమరావతి, నవంబర్ 29: నైరుతి బంగాళాఖాతంలో దిత్వా తుఫాను నేపథ్యంలో విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత (శనివారం) సమీక్ష నిర్వహించారు. తుఫాను తీవ్రతను బట్టి ఎప్పటికప్పుడు అంచనా వేసి ప్రభావిత జిల్లాలను అలర్ట్ చేయాలని అధికారులను ఆదేశించారు. సహాయక చర్యలకు ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపించాలన్నారు. రేపు, ఎల్లుండి ప్రకాశం, నెల్లూరు, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్ష సూచన ఉందని హోంమంత్రికి అధికారులు వివరించారు. దీంతో ఆయా జిల్లాల కలెక్టర్లతో అనిత ఫోన్లో మాట్లాడారు. ముందస్తు జాగ్రత్త చర్యలు పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తుఫాను సమాచారాన్ని ఎప్పటికప్పుడు కిందిస్థాయి అధికారులకు, ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కంట్రోల్ రూమ్‌లను 24/7 కొనసాగించాలని ఆదేశించారు. విపత్తుల సంస్థ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101 సంప్రదించాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్ళల్లో ఉండే వారిని గుర్తించి ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు.అవసరమైతే ప్రజలను సహాయక శిబిరాలకు తరలించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. విరిగిన చెట్లు తొలగించడం , విద్యుత్తు అంతరాయం జరిగితే పునరుద్ధరణ పనులు వెంటనే జరిగేలా ఏర్పాటు చేయాలని తెలిపారు. భారీ వర్షాలు కురుస్తున్నపుడు వీలైనంత వరకు ప్రజలు ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని హోంమంత్రి సూచనలు చేశారు. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బలమైన ఈదురుగాలుల వీచేప్పుడు చెట్లు, హోర్డింగ్స్ వద్ద ఉండవద్దని ప్రజలు హోంమంత్రి అనిత కీలక సూచనలు చేశారు.

## కర్నూలు రోడ్డు ప్రమాదంపై సీఎం చంద్రబాబు విచారం




**అమరావతి, నవంబర్ 29:** కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కోటేకల్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మరణించిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మరో ముగ్గురికి అత్యవసర వైద్య సహాయం అందించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇక.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ, రేంజ్ ఐజీలు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతి చెందిన ఐదుగురు కర్ణాటకలోని కోలార్ జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నట్టు సీఎం చంద్రబాబుకు అధికారులు తెలిపారు.మంత్రి అచ్చెన్నాయుడు ఆరాకర్నూలు జిల్లా రోడ్డు ప్రమాదంపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆరా తీశారు. కోటేకల్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఐదుగురు చనిపోవడం.. మృతుల్లో చిన్నారులు ఉండటంపై విచారం వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాపం తెలుపుతూ.. వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ప్రయాణికులు ప్రయాణ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకో వాలని సూచించారు. ప్రయాణికుల భద్రతా ప్రమాణాలపై కఠిన చర్యలు తీసుకునేలా అధికారులకు మరోసారి మంత్రి ఆదేశాలు జారీ చేశారు. రోడ్లపై ప్రయాణికుల నిర్లక్ష్యానికి తావు లేకుండా పర్యవేక్షణ పెంచాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచనలు చేశారు.మంత్రుల దిగ్భ్రాంతి కర్నూలు రోడ్డు ప్రమాద ఘటనపై మంత్రులు టీజీ భరత్, నిమ్మల రామానాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రులు ఆదేశించారు. ఈ ఘటన జరగడం ఎంతో బాధాకరమని.. మృతుల కుటుంబాలకు మంత్రులు టీజీ భరత్, నిమ్మల రామానాయుడు సంతాపం తెలిపారు.

## ఇన్ఫర్మేషన్ యాక్ట్‌తో సాధికారత కల్పన



చిత్తూరు: దేశ పౌరులకు సాధికారత కల్పించడమే ఇన్ఫర్మేషన్ యాక్ట్- 2005 ముఖ్య ఉద్దేశమని డీఆర్ఓ కే.మోహన్ రావు పేర్కొన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని ప్రత్యేక సమావేశ మందిరంలో ఇన్ఫర్మేషన్ యాక్ట్ -2005 అనే అంశంపై జిల్లా అధికారులతో అవేర్నెస్ ప్రోగ్రాంనిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డీఆర్ఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ ప్రజలకు వివిధ ప్రభుత్వ సంస్థల యంత్రాంగాలకు సంబంధిం చిన సమాచారాన్ని తెలుసుకునే హక్కు సమాచార హక్కు చట్టం కల్పించడం జరిగిందని తెలిపారు. సమాచార హక్కుకు సంబంధించిన నియమ నిబంధనలు విధివిధానాలను ఈ చట్టం నిర్దేశిస్తుంది. ఈ చట్టంలో ఆరు భాగాలు 31 సెక్షన్లు ఉన్నాయని తెలిపారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో సహాయ ప్రజా సమాచార అధికారి (ఏపీఐఓ) ప్రజా సమాచార అధికారి (పీఐఓ), అపిలేట్ అధికారి పేర్లను ప్రతీ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టానికి సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయాలని, అలాగే సమాచార హక్కు చట్టానికి సంబంధించి రిజిస్టర్లను నిర్వహించాలని తెలిపారు. గతంలో లేకపోయినా ఇప్పటినుండి అయినా కార్యాలయంలో బోర్డులను, రిజిస్టర్లను పక్కాగా నిర్వహించేలా చూడాలని ఆదేశించారు.అనంతరం రిటైర్డ్ తహసీల్దార్ రఘుపతి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 కింద ఎవరైనా ఏదైనా అడగవచ్చునని, దానికి సంబంధించి ఐదు రోజులలో వివరణ ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ నియంత్రణలోని కార్యాలయాలు సెక్షన్ టు పరిధిలోకి వస్తాయని తెలిపారు. సమాచారం హక్కు చట్టం అనగా రికార్డులు పత్రాలు అభిప్రాయాలు సలహాలు ఉత్తర్వులు డేటా అమలులో ఉన్న మరి చట్టం ప్రకారం ప్రభుత్వ యంత్రాంగం సంపాదించదగిన ఏ ప్రైవేటు సంస్థకు సంబంధించిన సమాచారమైన సెక్షన్ (2) ఎఫ్ కింద వస్తుందని తెలిపారు. పౌర సమాచార అధికారి నుండి నిర్ణీత సమయంలో సమాచారం అందని మరియు పౌర సమాచార అధికారి తీసుకున్న నిర్ణయంతో అసంతృప్తి చెందినవారు ఈ కాల పరిమితి ముగింపు తర్వాత లేక నిర్ణయం అందిన 30 రోజులలో సదరు పౌర సమాచార అధికారికి యంత్రములో సీనియర్ హోదాలో ఉన్న అధికారికి మొదటి ఆపిల్ను సెక్షన్ 19 (1) కింద అప్పీల్ ను సమర్పించుకోవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఎమ్మార్వోలు, సమాచార హక్కు చట్టం 2005 చూస్తున్న అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పరకామణి కేసు త్వరలోనే దుష్ట చతుష్టయం జైలుకెళ్లడం ఖాయం



**తిరుపతి, నవంబర్ 29:** తిరుమల పరకామణి కేసుకు సంబంధించి టీడీపీ నేత, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. పరకామణి కేసు రాజీ తీర్మానం జరిగిన పాలకమండలి సమావేశంలో ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పక్కన కూర్చుని ఉన్న భూమన కరుణాకర్ రెడ్డి ఫోటోను ఈ సందర్భంగా పట్టాభి బయటపెట్టారు. నిజమైన దుష్ట చతుష్టయం వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి, చెవిరెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డిలే అంటూ కామెంట్స్ చేశారు. చోరీ బయటపడిన ఏప్రిల్ 19 నుంచే ఆ కేసును నీరు గార్చటానికి వీరందరూ పూనుకున్నారని ఆరోపించారు. అందుకే కేసు పెట్టేప్పుడే 379, 381 మాత్రమే పెట్టారని.. సెక్షన్ 409ని ఉద్దేశపూర్వకంగా పెట్టలేదని మండిపడ్డారు.జగన్ మోహన్ రెడ్డికి, వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డికి అత్యంత సన్నిహితుడైన తిరుమల వన్ టౌన్ సీఐ కీలక పాత్ర పోషించారని ఆరోపించారు. ఏప్రిల్ 29న దొంగతనం బయటపడితే. మే 12న, మే 18న ఆస్తులు రాయించుకున్నారని. మే 30న చార్జిషీట్ వేశారన్నారు. జూన్ 19న టీటీడీ పాలకమండలి సమావేశంలో టేబుల్ అజెండాగా పెట్టారని ఆయన తెలిపారు. చార్జిషీట్ వేయక ముందే ఆస్తులు ఎలా రాయించుకుంటారని ప్రశ్నించారు. పరకామణి చోరీ వెనుక వీరు లేకపోతే... ఇంత త్వరత్వరగా ఎందుకు స్పందించారని నిలదీశారు. టీటీడీ రూల్ నెంబర్ 159 ప్రకారం ఆస్తులు రాయించుకోవాలంటే 30 రోజుల ముందు పత్రికల్లో ప్రకటన ఇవ్వాలని. అలా ఏమీ జరగలేదని చెప్పుకొచ్చారు. టీటీడీ ఛైర్మన్‌గా భూమన కరుణాకర్ రెడ్డి అయిన వెంటనే లోక్ అదాలత్‌లో రాజీకి తీర్మానం చేశారని పట్టాభి అన్నారు.అలాగే.. భూమన కరుణాకర్ రెడ్డి, భూమన అభినయ్ రెడ్డి ఆస్తులు 2004లో తుడా ఛైర్మన్, 2006లో టీటీడీ ఛైర్మన్ కాక ముందు ఎంత? ఆ తరువాత ఎంత అనే వివరాలను మీడియా సమావేశంలో పట్టాభి వెల్లడించారు. 2004కు ముందు రెండు చిన్న ప్లాట్లు ఉన్న భూమన కరుణాకర్ రెడ్డికి ఆ తరువాత కోట్ల రూపాయలు విలువ చేసే ఎకరాలకు ఎకరాలు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. భూమన కరుణాకర్ రెడ్డి, అభియనయ్ రెడ్డిల ఎన్నికల అఫిడవిట్‌లో ఆస్తులు కొన్న సంవత్సరాలను చూడమ ంటూ మీడియాకు చూపించారు.అబద్ధాలను తడబడకుండా చెప్పే వైసీపీ స్కూళ్లకు ప్రిన్సిపాల్ జగన్ మోహన్ రెడ్డి అని... ఆయన శిక్షణలో వీరంతా తడబడకుండా అబద్ధాలు చెప్పటంలో దిట్టలు అయ్యారంటూ ఎద్దేవా చేశారు. పరకామణి కేసులో ఫిర్యాదుదారుడు సతీష్ హత్యవెనుక భూమన పాత్ర ఉందని... నిజాలు బయటకు రాకూడదనే అతన్ని హత్య చేశారని ఆరోపించారు. అతి త్వరలోనే ఘోరానికి పాల్పడిన దుష్టచతుష్టయం జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. 'భూమన నువ్వు నైలు నదిలో ఉన్న ముసళ్లను కాదు... జైలు సెల్‌లో దోమలను, సెల్‌లోని గోడలకు ఉన్న బల్లులను లెక్కిస్తువులే సిద్ధంగా ఉండు' అంటూ పట్టాభి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

# జమ్మూకశ్మీర్‌లో మళ్లీ ఉగ్రవాదుల కదలికలు భారీ సెర్చ్ ఆపరేషన్



**జమ్మూకశ్మీర్:** జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల సంచారాన్ని గుర్తించిన భద్రతాదళాలు భారీ స్థాయిలో గాలింపు చర్యలు చేపడుతు న్నాయి. ఉధమ్‌పూర్ జిల్లా బసంత్‌గఢ్ ప్రాంతంలోని ఛింగ్లా-బలోతా గ్రామానికి ముగ్గురు ఉగ్రవాదులు వచ్చి వెళ్లినట్టు అధికారులకు తెలియడంతో భారీ సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంబించారు రాత్రి వేళ ఓ గ్రామస్థుడి ఇంటి తలుపు తట్టిన ముగ్గురు అనుమానాస్పద వ్యక్తులు ఆహారం కావాలని అడిగారు. వారి వాలకంపై సందేహం కలగడంతో భయపడ్డ ఇంటి ఓనర్ అక్కడి నుంచి పారిపోయారు. ఆ తరువాత భద్రతా దళాలకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న ఆర్మీ, సీఆర్‌పీఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసులు ఆ ప్రాంతంలో ఆంక్షలు విధించి భారీ స్థాయిలో గాలింపు చర్యలు ప్రారంభించారు. వాస్తవానికి ఉగ్రవాదుల కదలికలపై భద్రతా దళాలకు అంతుకుముందే సమాచారం అందడంతో అప్రమత్తమైయ్యారు. ఇక రాత్రి వేళ జరిగిన ఘటనతో ఉగ్రవాదులు ఉన్నారన్న విషయం రూఢీ అయ్యింది. దీంతో పెద్ద ఎత్తున గాలింపు చర్యలకు దిగారు. భారత్‌లోకి చొరబడే ఉగ్రవాదులు బసంత్‌గఢ్ ప్రాంతం మీదుగా వస్తుంటారని భద్రతా దళాలు తెలిపాయి. ఆ ప్రాంతంలో పర్వతాలు, దట్టమైన అడవుల మాటున భారత్‌లోకి అక్రమంగా ప్రవేశిస్తుంటారు. కథువా సెక్టర్‌లో అంతర్జాతీయ సరిహద్దును దాటి బసంత్‌గఢ్, దోడా, కిష్ట్‌వార్ జిల్లాల మీదుగా కశ్మీర్ లోయలోకి ప్రవేశిస్తారు. ఉగ్రవాదులకు ఇది ప్రధాన మార్గంగా మారడంతో ఇక్కడ ఇప్పటికే అనేక ఎన్‌కౌంటర్లు చోటు చేసుకున్నాయి. ఇక తాజా ఘటనలో ఉగ్రవాదులు అడవిలో దాక్కుని ఉంటారని అనుమానిస్తున్నభద్రతాహైఅలర్ట్‌లో ఉన్నాయి.

# శాటిలైట్ల సమాచారానికి ఏఐ- ప్రకృతి వైపరీత్యాలపైనా భవిష్య వాణి



**న్యూ ఢిల్లీ :** ప్రకృతి వైపరీత్యాలు ఎప్పుడు సంభవిస్తాయి? ఎక్కడ సంభవిస్తాయి అనేది ముందస్తుగా గుర్తించేందుకు శాటిలైట్లు అందించే సమాచారాన్ని ఉపయోగించొచ్చని ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ తెలిపారు. చాలా ఏళ్లుగా ఏఐ టెక్నాలజీని ఇస్రో వినియోగిస్తోందని, ఇందుకోసం ప్రత్యేక టీమ్స్ పనిచేస్తున్నాయని ఆయన చెప్పారు. ఇస్రో తన ప్రత్యేక టీమ్స్ ద్వారా వివిధ అవసరాల కోసం ఏఐ మోడల్స్, ల్యాంగ్వేజ్ మోడల్స్, డాటా డ్రివెన్ మోడల్స్, ఏజెంటిక్ మోడల్స్‌ను అభివృద్ధి చేయించిందని వెల్లడించారు. శాటిలైట్లు పంపే విలువైన సమాచారాన్ని వీటితో విశ్లేషణ చేయిస్తే ప్రకృతి వైపరీత్యాలను ముందస్తుగా అంచనా వేయొచ్చన్నారు. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో ఏబీవీపీ 71వ జాతీయ సదస్సులో ఎస్.సోమనాథ్ ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన ఈటీవీ భారత్?తో ప్రత్యేకంగా మాట్లాడుతూ కీలక వివరాలను వెల్లడించారుప్రకృతి వైపరీత్యాలపైనా భవిష్య వాణి 'శాటిలైట్లు నిత్యం భూమిపై, విశ్వంపై ఓ కన్నేసి ఉంచుతాయి. ఈ పర్యవేక్షణ ద్వారా సేకరించిన సమాచారాన్ని అవి కమాండ్ కంట్రోల్ సెంటర్లకు పంపుతుంటాయి. దీన్ని చాలా రంగాల్లో వినియోగిస్తుంటారు. ప్రకృతి వైపరీత్యాలపై ముందస్తు అంచనాలకు వచ్చేందుకూ ఈ విలువైన సమాచారం దోహదపడుతుంది. ఉదాహరణకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఏటా చాలాచోట్ల, చాలాసార్లు కొండచరియలు విరిగి పడుతుంటాయి. ఇస్రో ప్రయోగించిన శాటిలైట్లు సేకరించి పంపే సమాచారాన్ని ఏఐ మోడల్స్‌తో విశ్లేషణ చేయించి, ప్రకృతి వైపరీత్యాలపై ముందుగా అలర్ట్‌లను పొందొచ్చు. ఇందుకోసం ఇప్పటికే ఇస్రో ఒక మ్యాప్‌ను తయారు చేసింది. కొండచరియలు విరిగి పడే అవకాశాలున్న సున్నిత ప్రదేశాలు ఆ మ్యాప్‌లో ఉన్నాయి. ఆయా ప్రదేశాల్లో కొండచరియలు విరిగిపడొచ్చని ఏఐ మోడల్స్ గుర్తించిన వెంటనే రాష్ట్ర వాతావరణ విభాగాలకు అలర్ట్‌లు జారీ అవుతాయి. ఈ అలర్ట్‌ల సమాచారంపై పూర్తి ధ్రువీకరణ కోసం తాజా వర్షపాత సమాచారం, గ్రౌండ్ రిపోర్ట్, వర్షపాత నమూనాలను పరిశీలించి అన్వయం చేసుకోవాలి. ఇందుకోసం వివిధ రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి చాలా ప్రాజెక్టులను ఇస్రో అమలు చేస్తోందిట అని ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ తెలిపారు.టెక్టోనిక్ ప్లేట్ల నుంచి భూగర్భ జలాల దాకా అన్నింటి చిట్టా'శాటిలైట్లు సేకరించే జియో స్పేషియల్ డాటాలోనే ఆప్టికల్ డాటా, రాడార్ డాటా, థర్మల్ డాటా ఒక భాగంగా ఉంటాయి. ఇటీవలే ఎన్ఐఎస్ఏఆర్ శాటిలైట్‌ను ఇస్రో ప్రయోగించింది. అదొక డ్యూయల్ బ్యాండ్ రాడార్ శాటిలైట్. ఇది ప్రతి 12 రోజులకోసారి భూమికి చెందిన ఒక డీటెయిల్డ్ ఫొటోను తీసి పంపుతుంది. ఇందులో చాలా సవివర సమాచారం దాగి ఉంటుంది. భూమి లోపలి టెక్టోనిక్ ప్లేట్ల కదలికలు ఎలా ఉన్నాయి? భూగర్భ జలాల ఒత్తిడి ఎక్కడెక్కడ ఎంతమేర ఉంది? ఏయే చోట్ల వాతావరణ మార్పులు ఎలా జరుగుతున్నాయి? అనే ముఖ్య సమాచారాన్ని ఈ ఫొటో ద్వారా మనం గుర్తించొచ్చు. ఏఐ టెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ టూల్స్‌తో ఈ ఫొటోను అధ్యయనం చేయడం చాలా ఈజీ. ఆ ఫొటోలో దాగిన అన్ని రకాల సమాచారాన్ని సేకరించి, వర్గీకరించి అందించే కెపాసిటీ ఏఐ టెక్నాలజీకి ఉంది. శాటిలైట్లు అందించే ఈ సమాచారాన్ని సమర్థంగా వినియోగిస్తే, ప్రకృతి వైపరీత్యాలు, పర్యా ఓవరణ మార్పులను ఎదుర్కొనేందుకు మనం ముందస్తుగా సమాయత్తం కావచ్చు. ఆస్తి, ప్రాణ నష్టాన్ని వీలైనంత మేరకు తగ్గించేలా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టొచ్చు. చివరకు వ్యవసాయ రంగానికి కూడా ఈ సమాచారం దోహదపడుతుంది. శాటిలైట్లు ఇచ్చే సమాచారం ప్రకారం పంటలసాగు ట్రెండ్‌ను మార్చుకోవాలి. కాలానుగుణంగా వేసే పంటల్లో మార్పులు చేసుకోవాలి'ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ వివరించారు.

# మా మధ్య ఎలాంటి విభేదాలు లేవు




**కర్ణాటక:** సీఎం సీటుపై రగడ కొనసాగుతున్న వేళ కీలక పరిణామం జరిగింది. పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు బ్రేక్ ఫాస్ట్ మీటింగ్?లో పాల్గొన్న సీఎం సిద్ధరామయ్య, ఉపముఖ్య మంత్రి డీకే శివకుమార్ నాయకత్వ మార్పునకు సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. నాయకత్వ మార్పు అంశంపై పార్టీ హైకమాండ్ ఏ నిర్ణయం తీసుకున్నా తామిద్దరం గౌరవిస్తామని ప్రకటించారు. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని పేర్కొన్నారు. ఈ మేరకు సంయుక్త మీడియా సమావేశంలో వ్యాఖ్యానించారు.'మా ఇద్దరి మధ్య విభేదాలు లేవు'డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, తన మధ్య ఎటువంటి విభేదాలు లేవని కర్ణాటక ముఖ్యమంత్రి సీఎం సిద్ధరామయ్య స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా తమ ఇద్దరి మధ్య ఎలాంటి విభేదాలు ఉండవని తెలిపారు. 2028లో జరగబోయే కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్?ను మరోసారి అధికారంలోకి తేవడం గురించి ఇద్దరం చర్చించుకున్నామని పేర్కొన్నారు. అలాగే త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల గురించి కూడా మాట్లాడుకున్నామని అన్నారు. డీకే శివకుమార్?తో బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ అనంతరం సిద్ధరామయ్య ఈ వ్యాఖ్యలు చేశారు."అల్పాహారం బాగుంది. ఇక్కడ మేము ఏమీ మాట్లాడుకోలేదు. డీకేఎస్ ఈరోజు మా ఇంటికి వచ్చారు. నన్ను తన ఇంటికి ఆహ్వానించారు. డీకే శివకుమార్, నా ప్రధాన అజెండా 2028 అసెంబ్లీ ఎన్నికలే. అలాగే త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కూడా ముఖ్యమైనవి. వాటి గురించి చర్చించాం. 2028 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మరోసారి రాష్ట్రంలో అధికారంలోకి తిరిగి తీసుకురావడం గురించి కూడా చర్చలు జరిపాం. ఇద్దరం కలిసి పనిచేస్తాం. డీకే శివకుమార్, నా మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేవు, ఇకముందూ ఉండబోవు.'

# కస్టడీ మరణాలు వ్యవస్థకే మచ్చ



**న్యూఢిల్లీ:** పోలీస్ కస్టడీలో జరిగే హింస, మరణాలపై సర్వోన్నత న్యాయస్థానం ఆవేదన వ్యక్తం చేసింది. ఇలాంటి వ్యవహారం మొత్తం వ్యవస్థకే మాయని మచ్చ అని, దీనిని దేశం సహించలేదని వ్యాఖ్యానించింది. పోలీస్ స్టేషన్లలో సీసీటీవీలు పనిచేయకపోవడాన్ని సుమోటో కేసుగా తీసుకున్న సుప్రీంకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది.ఈ సందర్భంగా రాజస్థాన్‌లో గత ఎనిమిది నెలల్లో పోలీస్ కస్టడీలో 11 మరణాలు నమోదయ్యాయని తెలిపింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ద్విసభ్య ధర్మాసనం ఈ కేసును విచారించింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, కస్టడీ మరణాలను ఎవరూ సమర్థించరని, సమర్థించే పరిస్థితి కూడా లేదని చెప్పారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూకస్టడీ మరణాలపై కేంద్రం ఎందుకు అఫిడవిట్ దాఖలు చేయలేదని ప్రశ్నించింది. "ఈ కోర్టును ఎందుకు తేలికగా తీసుకుంటున్నారు?" అని జస్టిస్ విక్రమ్ నాథ్ నిలదీశారు.దీనికి తుషార్ మెహతా సమాధానమిస్తూ, కోర్టును తేలికగా తీసుకునే ప్రశ్నే రాదని, మూడు వారాల్లో కేంద్రం కంప్లయెన్స్ అఫిడవిట్ దాఖలు చేస్తుందని హామీ ఇచ్చారు.విచారణలో ధర్మాసనం వ్యాఖ్యానిస్తూ అమెరికాలో పోలీస్ స్టేషన్లు, జైళ్లలో జరిగే వ్యవహారాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారని పేర్కొంది. దీనికి స్పందిస్తూ సొలిసిటర్ జనరల్ మెహతా, అమెరికాలో రిసార్ట్ స్థాయి సౌకర్యాలు కలిగిన ప్రైవేట్ జైళ్లు కూడా ఉన్నాయని తెలిపారు.2018లోనే పోలీస్ స్టేషన్లలో మానవ హక్కుల ఉల్లంఘనలను నిరోధించేందుకు సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. తాజాగా (2020 ఉత్తర్వులు) అమలుపై దాఖలైన సుమోటో కేసులో అమికస్ క్యూరీగా సహకరిస్తున్న సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే వాదనలు విన్న తరువాత, సీబీఐ, ఈడీ, ఎన్ఐఏ సహా అన్ని దర్యాప్తు సంస్థల కార్యాలయాల్లో సీసీటీవీ కెమెరాలు, రికార్డింగ్ పరికరాలు ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది.కస్టడీ హింస, మరణాలపై సుమోటో రిట్ పిటిషన్ విషయంలో 11 రాష్ట్రాలు మాత్రమే అఫిడవిట్‌లు దాఖలు చేశాయని, మిగతా రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలు ఇంకా స్పందించలేదని ధర్మాసనం పేర్కొంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం కూడా ఉందని స్పష్టం చేసింది.అఫిడవిట్‌లను దాఖలు చేయడానికి మరికొంత సమయం ఇస్తూ విచారణను డిసెంబర్ 16కు వాయిదా వేసింది. ఆ గడువులోగా అఫిడవిట్‌లు దాఖలు చేయని పక్షంలో, ఆయా రాష్ట్రాల హోంశాఖ ప్రధాన కార్యదర్శులు కోర్టు ముందు హాజరు కావాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

# భారత్‌కు పుతిన్ ప్రధాని మోదీతో ఆ డీల్‌పై కీలక చర్చలు




**రష్యా :** రష్యాఅధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రెండు రోజుల పర్యటన నిమిత్తం డిసెంబర్ 4 నుండి 5 వరకు భారత్‌ను సందర్శించనున్నారు. ఈ పర్యటనలో ఆయన 23వ భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ, అధ్యక్షుడు పుతిన్ ద్వైపాక్షిక సంబంధాలలో పురోగతిని సమీక్షించనున్నారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈ పర్యటనను ధృవీకరించింది." ఈ పర్యటన ఇరు దేశాల నాయకత్వానికి ప్రత్యేకం. విశేష వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, అలాగే ప్రపంచ సమస్యలపై అభిప్రాయాలను పంచుకోవడానికి అవకాశం కల్పిస్తుంది"అని తెలిపింది.రక్షణ సహకారం 400 క్షిపణి వ్యవస్థలుఈ శిఖరాగ్ర సమావేశంలో రక్షణ అంశాలు అజెండాలో ప్రముఖంగా ఉన్నాయి. ముఖ్యంగా ఆపరేషన్ సింధూర్ సమయంలో -400 వ్యవస్థ చాలా బాగా పనిచేశాయని రుజువు కావడంతో, భారత్ రష్యా నుంచి మరిన్ని -400 వ్యవస్థలను కొనుగోలు చేయాలని చూస్తోంది. అయితే -400 క్షిపణి వ్యవస్థల డెలివరీలో ఆలస్యం జరుగుతోంది. ఈ జాప్యానికి గల కారణాలను, మిగిలిన డెలివరీలు ఎప్పుడు పూర్తవుతాయో రష్యాను అడుగుతామని రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ తెలిపారు. కనీసం రెండు స్క్వాడ్రన్ల అత్యాధునిక -57 యుద్ధ విమానాలను కొనుగోలు చేసే విషయం కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది. అలాగే , సుఖోయ్ అప్‌గ్రేడేషన్ వంటి ఇతర ప్రధాన కార్యక్రమాలలో జాప్యాలను కూడా చర్చించి, వాటిని వేగవంతం చేయడానికి కృషి చేస్తామని సింగ్ తెలిపారు.చమురు ఉక్రెయిన్ వివాదం పుతిన్ పర్యటనలో అంతర్జాతీయ అంశాలు కూడా కీలకంకానున్నాయి. అమెరికా ఆంక్షల తర్వాత భారత్ చమురు కొనుగోళ్లను తగ్గించింది. అందుకే భారత్‌కు ముడి చమురు కొనడానికి రష్యా మరిన్ని డిస్కౌంట్‌లు ఇచ్చే అవకాశం ఉంది. ఉక్రెయిన్ వివాదం త్వరగా ముగియాలని, శాశ్వత శాంతి నెలకొనాలని ప్రధాని మోదీ పదేపదే కోరుతున్నారు. ఈ యుద్ధాన్ని ఆపే శాంతి మార్గం గురించి కూడా మోదీ, పుతిన్ చర్చిస్తారు. ఇటీవల విదేశాంగ మంత్రి జైశంకర్ ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆంద్రీ సిబిహాతో చర్చించి, వివాదాన్ని త్వరగా ముగించడానికి, శాశ్వత శాంతిని నెలకొల్పడానికి భారత్ మద్దతు ఇస్తుందని పునరుద్ఘాటించారు. ఈ అంశంపై పుతిన్, మోదీ మధ్య చర్చల్లో కీలక స్థానం లభించే అవకాశం ఉంది.రష్యా ఎప్పుడూ భారతదేశానికి ఒక నమ్మకమైన స్నేహితుడిగా ఉంది. ఈ పర్యటన ద్వారా ఇరు దేశాల సంబంధాలు మరింత బలపడతాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, పుతిన్‌కు విందు ఇవ్వనున్నారు. పుతిన్ చివరిసారిగా డిసెంబర్ 2021లో భారతదేశంలో పర్యటించారు.

# ఈడీ ఛార్జిషీటుపై నిర్ణయాన్ని డిసెంబర్ 16కు వాయిదా వేసిన కోర్టు



**న్యూఢిల్లీ:** నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ () దాఖలు చేసిన ఛార్జిషీటును విచారణకు స్వీకరించే విషయంలో నిర్ణయాన్ని రౌస్ అవెన్యూ కోర్టు డిసెంబర్ 16వ తేదీకి వాయిదా వేసింది. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, తదితరులను ఈ కేసులో నిందితులుగా ఈడీ చేర్చిందిబీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి 2012లో చేసిన ఫిర్యాదుతో ఈ కేసు వెలుగులోకి వచ్చింది. నేషనల్ హెరాల్డ్ పత్రిక ప్రచురణకర్త అయిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ కు చెందిన రూ.2,000 కోట్లకు పైగా ఆస్తులను రూ.50 లక్షల నామమాత్రపు చెల్లింపుతో కాంగ్రెస్ నేతలు అక్రమంగా చేజిక్కుంచుకున్నారని ఈడీ ప్రధాన ఆరోపణగా ఉంది. యంగ్ ఇండియన్ సంస్థ ద్వారా కుట్ర జరిగిందని, ఈ సంస్థలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీకి చెరో 38 శాతం వాటాలు ఉన్నాయని ఈడీ చెబుతోంది.సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, శామ్ పిట్రోడా, సుమన్ దూబే, దివంగత మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెంట్, యంగ్ ఇండియన్ అండ్ డొటెక్స్ మర్చంటైజ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద నిందితులుగా చేర్చారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 16న కోర్టు తీసుకునే నిర్ణయం కీలకం కానుంది.

# పోలీసులపై పెట్రోల్ చల్లి నిప్పంటించిన నిరసనకారులు



**చండీగఢ్:** నిరసనకారులు పోలీసులతో ఘర్షణకు దిగారు. చేతిలోని బాటిల్స్‌లో ఉన్న పెట్రోల్ పోలీసులపై చల్లారు. ఒక పోలీస్ అధికారికి నిప్పంటించారు. దీంతో ఆయనకు కాలిన గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ నిరసనకారులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పంజాబ్‌లోని సంగ్రూర్‌లో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం స్థానిక కాంట్రాక్ట్ రోడ్‌వేస్ ఉద్యోగులు తమ డిమాండ్ల కోసం నిరసనకు దిగారు. కొందరు బస్సులపైకి ఎక్కి నినాదాలు చేశారు. వారి చేతుల్లో పెట్రోల్ ఉన్న బాటిల్స్ ఉన్నాయి.కాగా, నిరసనకారులను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఈ సందర్భంగా వారి మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో నిరసనకారులు తమ చేతుల్లో ఉన్న బాటిల్స్‌లోని పెట్రోల్‌ను కొందరు పోలీసులపై చల్లారు. పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో) ఇన్‌స్పెక్టర్ జస్వీర్ సింగ్ యూనిఫార్మ్‌పై పెట్రోల్ పడటంతో ఎవరో నిప్పంటించారు. దీంతో ఆయన డ్రెస్‌కు మంటలు అంటుకున్నాయి.మరోవైపు అక్కడున్న పోలీసులు వెంటనే స్పందించారు. పోలీస్ అధికారి జస్వీర్ సింగ్ యూనిఫార్మ్‌కు అంటుకున్న మంటలను ఆర్పివేశారు. కాలిన గాయాలైన ఆయనను హాస్పిటల్‌కు తరలించారు. కాంట్రాక్ట్ రోడ్‌వేస్ ఉద్యోగులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన నేపథ్యంలో పది మంది నిరసనకారులపై హత్యాయత్నంతోపాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# బంగ్లాదేశ్‌లో భారీ అగ్నిప్రమాదం స్లమ్‌లో కాలిబూడిదైన 1500 ఇళ్లు




**ఢాకా :** బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని అతిపెద్ద స్లమ్ కోరలిలో మంగళవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 1,500కు పైగా ఇళ్లు కాలిపోయాయి. వేలాది మంది నిరాశ్రయు లయ్యారు. మహిళలు, గర్భిణులు, పిల్లలు రాత్రంతా చలిలోనే గడిపారు. వంట గ్యాస్ సిలిండర్ పేలడం వల్ల ఈ అగ్నిప్రమాదం జరిగిందని, బుధవారం మధ్యాహ్నానికి మంటలను అదుపులోకి తెచ్చినట్టు అధికారులు చెప్పారు.పక్కపక్కనే ఇళ్లు ఉండటంతో మంటలు వేగంగా ఒక ఇంటి నుంచి మరోదానికి వ్యాపించాయని తెలిపారు. 160 ఎకరాలలో విస్తరించి ఉన్న కోరలిలో 80 వేల మంది నివసిస్తున్నారు. క్షణాల్లోనే ఇల్లు, ఇంటిలోని సామాన్లు బుగ్గి అయిపోయాయని, కేవలం కట్టుబట్టలతో రోడ్డున పడ్డామని బాధితులు వాపోయారు. కాగా, బాధితులను ఆశ్రయ కేంద్రాలకు తరలించామని, గాయపడ్డ వారికి దవాఖానలలో చికిత్స అందజేశామని, ప్రమాదంలోంచి బయటపడిన ఒక గర్భిణి గురువారం ఉదయం ఒక బిడ్డను ప్రసవించిందని అధికారులు తెలిపారు.

# బ్రిటన్ కొత్త నిబంధనలతో భారతీయులకు కష్టాలు

**లండన్:** పాకిస్థానీ మూలాలుగల బ్రిటిష్ హోం సెక్రటరీ షబానా మహమూద్ వలసదారుల కోసం చేసిన ప్రతిపాదనలు ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ ప్రతిపాదనలకు పార్లమెంటు ఆమోదం కచ్చితంగా లభించవచ్చు. అవి చట్టంగా అమలైతే, ఏటా వేలాది భారతీయ వలసదారులపై ప్రభావం పడుతుంది. ఆమె చేసిన ప్రతిపాదనల ప్రకారం, శరణార్థులకు తాత్కాలిక హోదాను కేవలం రెండున్నరేళ్లు మాత్రమే ఇవ్వాలి. ఆ తర్వాత వారి స్వదేశాల్లో పరిస్థితులు మెరుగుపడితే, వారిని తిరిగి ఆయా దేశాలకు పంపించేయాలి.శాశ్వతంగా బ్రిటన్‌లో స్థిరపడాలంటే 20 ఏళ్ల తర్వాతే వారి దరఖాస్తులను పరిశీలించాలి. బ్రిటన్‌లో ఆశ్రయం కోరుతున్నవారిలో భారతీయులు ఆరో స్థానంలో ఉన్నారు. 2024 జూలై నుంచి 2025 జూన్ వరకు 5,475 మంది ఆశ్రయం క్లెయిమ్ చేశారు. వీరిలో కేవలం 20 మందికి మాత్రమే ఆశ్రయం లభించింది, 2,691 మందికి ఆశ్రయాన్ని తిరస్కరించారు. మిగిలినవారంతా ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తున్నారు. 5,475 మంది భారతీయుల్లో 346 మంది చట్టవిరుద్ధంగా చిన్న పడవల్లో బ్రిటన్‌కు వెళ్లారు. మిగిలిన వారిలో చాలా మంది స్టూడెంట్ వీసాల వంటి చట్టబద్ధ మార్గాల్లో వెళ్లారు. ఆ తర్వాత తమ వీసా గడువు ముగిసిన తర్వాత ఆశ్రయం కోరారు. ఇటువంటి వారిని బ్రిటన్ నుంచి పంపించడం ప్రారంభిస్తామని మహమూద్ చెప్పారు.

# రాజకీయ పార్టీల నిబద్ధతకు పరీక్ష !

రాజకీయాల్లో సంకల్ప బలం ముఖ్యం. తమతో పాటు బడుగుబలహీన వర్గాలను ముందుకు తీసుకుని వెళ్దామన్న ప్రయత్నం చేయాలి. ఎంతసేపు వారే పల్లకి మోయాలన్న ఫ్యూడల్ భావాలను వీడాలి. పల్లకి ఎక్కే అవకాశం వారికి కూడా కల్పించాలి. వారినీ సానబెట్టి రాటదేలేలా చేయాలి. స్థానిక ఎన్నికల్లో 42 శాతం బిసి రిజర్వేషన్ల అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. ఇదే అదనుగా కాంగ్రెసేతర పార్టీలు కాంగ్రెస్‌ను తిట్టిపోస్తూ రాజకీయంగా లబ్దిపొందాలని చూస్తున్నాయి. నిజానికి రాజకీయంగా లబ్ది పొందాలంటే ఆయా వర్గాల్లో పట్టును సాధించాలి. అందుకు పార్టీ పరంగా ఆయా వర్గాలను ముందుకు తీసుకుని వెళ్లాలి. హైకోర్టు తీర్పు తరవాత గత్యంతరం లేని పరిస్థితు ల్లో ప్రభుత్వం పాతపద్దతిలోనే స్థానిక ఎన్నికలకు సిద్దం అయ్యింది. ఇది ఆహ్వానించదగ్గ విషయం. రిజర్వేషన్లు ఉంటేనే బిసిలను, ఎస్సీ,ఎస్టీలను ఆదరించడం కాదు...లేకున్నా వారికి రాజకీయంగా ప్రవేశం కల్పించాలి. ఇప్పుడు రాజకీయ పార్టీలు అదేపనిగా పాత వ్యవహారాలను తవ్వుతూ పోకుండా తమ పార్టీ పరంగా బిసిలు, ఎస్సీలు, ఎస్టీలను రాజకీయాంగా పైకి తీసుకుని వచ్చే ప్రయత్నాలు చేయాలి. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ పెట్టగానే ఎందరో ఎస్సీలు, ఎస్టీలు, బిసిలకు టిక్కెట్లు ఇచ్చి రాజకీయంగా వారికి అండగా నిలిచారు. అనామకులు ఎందరో రాజకీయంగా తెరపైకి చ్చారు. గుంటూరులో కాంగ్రెస్ దిగ్గజం ఆచార్య ఎన్‌జి రంగా లాంటి వారు అనామకుడి చేతిలో ఓటమి చెందారు. అలా ఆనాడు ఎన్టీఆర్ సృష్టించిన ప్రభంజనంలో మహామహులు ఓటమి చెందారు. కొత్త తరం రాజకీయాల్లోకి వచ్చింది. అలా రాజకీయాల్లోకి వచ్చి నిలదొక్కుకున్న వారు నిలదొక్కుకున్నారు. ఆ తరవాత అదే ఒరవడి సాగింది. ఇది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బడుగు, బలహీనవర్గాల రాజకీయ ప్రవేశాలకు నాంది పలికింది.




కుల ప్రాతిపదికను మొదటి కమిషన్ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తే, కులాన్ని ఒక సూచికగా తీసుకోవాలని ఉన్నత న్యాయస్థానం మండల్ కమిషన్ తీర్పులో స్పష్టం చేసింది. 1992లో ఇందిరా సహాని కేసులో సుప్రీంకోర్టు మొత్తం రిజర్వేషన్లు 50శాతానికి మించకూడదని ఇచ్చిన తీర్పు ఫలితంగా తమిళనాడు సహా ఎన్నో రాష్ట్రాల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. చివరికి ఇందిరా సహాని కేసు కూడా పరీక్ష ఎదుర్కొనక తప్పలేదు. తమిళనాడు 69శాతం రిజర్వేషన్లు కల్పించినప్పటికీ సుప్రీంకోర్టు విధించిన పరిధి వల్ల సందిగ్ధత ఏర్పడింది. దీంతో అసెంబ్లీలో ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చి, 69శాతం రిజర్వేషన్లు అమలు అయ్యేట్టు, సుప్రీంకోర్టు విధించిన 50శాతం పరిధి నుండి రక్షణ పొందడానికి రాజ్యాంగం 9వ షెడ్యూల్లో చేర్చేట్టుగా అప్పటి ముఖ్యమంత్రి జయలలిత పావులు కదిపారు. అయితే ఇదంతా అసెంబ్లీ, పార్లమెంట్ వ్యవహారాల్లో పోరాడాల్సిన అంశం. అప్పటి వరకు ఈ వర్గాలను దూరం చేసుకోవడం తగదు. నిజానికి ఈ వర్గాలను దగ్గరకు చేసుకునేందుకు ఇదో మహత్తర అవకాశంగా రాజకీయ పార్టీలు భావించాలి. సర్పంచ్ పదవి అన్నది ఎవరైనా రాజకీయంగా ఎదగడానికి పరమపద సోపానం లాంటిది. యువతను రాజకీయాల్లో ఆహ్వానించేందుకు, గ్రామాలను అభివృద్దిలో నిలిపేందుకు ఇదో మంచి అవకాశం. అధికార కాంగ్రెస్ సహా అన్ని పార్టీలు సర్పంచ్ ఎన్నికల్లో వివిధ కులవర్గాలకు చెందిన సమర్థులైన యువతను నిలపాలి. చదువున్న వారికి ప్రాధాన్యం ఇవ్వాలి. నిజాయితీ రాజకీయాలను ప్రోత్సహించాలి. అందుకు రిజర్వేషన్లు లేనిచోట్ల ఎస్సీ,ఎస్టీ, బిసి వర్గాలను నిలబెట్టాలి. వారంతా రాజకీయంగా ఎదగడానికి అవకాశం వస్తుంది.దీంతో రాజకీయాల్లో కొత్తనీరు రావడానికి ప్రాతిపదిక వస్తుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం పాత రిజర్వేషన్లతోనే పంచాయతీ ఎన్నికలను నిర్వహించక తప్పడం లేదు. మరొకవైపు శాసనసభలో చేసిన తీర్మానాలకు కట్టుబడి, 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు రక్షణ కల్పించేలా 9వ షెడ్యూల్‌ను ఆశ్రయించాలనే ఉద్యమం కొనసాగుతోంది. ఈ విషయంలో ప్రచారం వేగంగా మారుమూల ప్రాంతాల ప్రజలకు కూడా చేరింది. గ్రామాల్లో కూడా ఇప్పుడిప్పుడే యువత రాజకీయాల వైపు మొగ్గుచూపుతోంది. ఎంతకాలం వృద్ద జంబుకాలే పార్టీల్లో వేలాడకుండా కొత్తతరాన్ని ఆహ్వానించాలి. సమాజంలో అట్టడుగుస్థాయి వర్గాలను వెతికి పట్టుకుని, వారిని రాజకీయాల్లో ముందుకు తీసుకుని రావాలి. ఎంతకాలం వారిని కేవలం కార్యకర్తలుగానే ఉపయోగించకునే దౌర్భాగ్యం నుంచి బయటపడి నవతరం నాయకత్వం అవతరించే దిశగా నేడు పార్టీలు అడుగులు వేయాలి. పార్టీపరంగా వారికి అండదండలు కల్పించాలి. సవాళ్లను ఎదుర్కోవడానికి నిరంతర అవగాహన కల్పించాలి. వారిని రాజకీయాల్లో రాటుదేలేలా చేయాలి. విద్యార్థి ఉద్యమాలతో రాటుదేలిన వారిని ముందుకు దింపాలి. ఇందుకు పార్టీపరంగా సమైక్య పోరాటం అనివార్యంగా గుర్తించాలి. తెలంగాణ శాసనసభలో చేసిన ఏకగ్రీవ తీర్మాణాలకు అనుగుణంగా అన్ని రాజకీయ పార్టీలు 42శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలిపాయి. అదే స్ఫూర్తితో బీసీ సభ్యులను ఇప్పుడు గెలిపించుకోవాలి. పంచాయతీ ఎన్నికలలో సర్పంచ్ ఎన్నికకు పార్టీ గుర్తు ఉండదన్న నెపంతో వీరిని పక్కన పెట్టాలని చూస్తే అసెంబ్లీ తీర్మానాలకు విలువ ఉండదు. అందువల్ల అన్ని పార్టీలు ఈ విషయంలో తీవ్రంగా ఆలోచన చేసి, రిజర్వేషన్లు లేనిచోట్ల వివిధ వర్గాల అభ్యర్థులను నిలబెట్టి ముందుకు నడిపించాలి. రాజకీయాలలో ప్రతి ఒక్కరూ ఓటు వేసే విధంగా మనకు సమానత్వం ఉంది. కానీ సామాజిక, ఆర్థిక జీవితంలో మనకు అసమానతలు అనేకం ఉన్నాయి. ప్రధానంగా రాజకీయాల్లో పదవుల పందేరంలో ఇప్పటికీ అంగ్రవర్గాలదే పైచేయిగా ఉంటోంది. మనం ఈ వైరుధ్యాన్ని వీలైనంత త్వరగా తొలగించాలి. లేకుంటే అసమానతలు ఎదుర్కొంటున్న వారిలో ఆవేశం కట్టలు తెంచుకుంటే, అజమాయిషీ చెలాయిస్తున్న వారు అడుసులో కూరుకు పోతారు. ఎంతో కష్టపడి నిర్మించిన రాజకీయ ప్రజాస్వా మ్య నిర్మాణాన్ని బలోపేతం చేయాలంటే అసమానతలు అన్నవి తొలగించుకుంటూ పోవాలి. అందుకు రిజర్వేషన్లే ప్రాతిపదిక కానవసరం లేదు. రాజకీయ సంకల్పం ఉంటే ఇది సాధ్యం అవుతుంది. ఉన్నత వర్గాల వారికి చట్టసభల్లో స్థానాలు తగ్గించి, బీసీ వర్గాలకు స్థానాలు పెంచడం వల్ల సామాజిక సామరస్యత వస్తుంది. ఇప్పుడు రిజర్వేషన్ల కోసం కొట్లాడుతున్న బీసీ నాయకుల ను ఎన్నికలలో గెలిపించిన చరిత్రను

---

# అక్స్‌ఫర్డ్ చర్చలకు రాకుండా అబద్దాల ప్రచారం

**భారత్‌పై నోరు పారేసుకున్న పాక్ ప్రతినిధులు**

**గట్టిగా తిప్పికొట్టిన భారత్ ప్రతినిధి**

**న్యూఢిల్లీ,నవంబర్29:** తప్పుడు ప్రచారాలు చేయడం ద్వారా తప్పుకోవడం అలవాటు చేసుకున్న పాకిస్థాన్ మరోసారి తన వక్రబుద్ధిని చాటుకుంది. యూకేలో జరిగే ప్రముఖ చర్చలో పాల్గొనకుండా.. భారత్ అధికారులు వెనుదిరిగారంటూ తప్పుడు ప్రచారానికి తెర లేపింది. అయితే, దీన్ని భారత్ గట్టిగా తిప్పికొట్టింది. వివరాల్లోకి వెళితే.. యూకేలో ఆక్స్‌ఫర్డ్ యూనియన్‌లో గురువారం భారత్- పాక్ అధికారుల మధ్య చర్చజరగాల్సి ఉంది. ఇందులో భారత్ తరఫున మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎం.ఎం.నరవాణెళి, సుబ్రమణియన్ స్వామి, రాజస్థాన్ మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్‌లు పాల్గొనాల్సి ఉంది. పాక్ నుంచి ఆ దేశ మాజీ విదేశాంగ మంత్రి హీనా రబ్బానీ, యూకేలోని రాయబారి మొహమ్మద్ ÷సైల్, రిటైర్డ్ జనరల్ జుబైరా మహమూద్ హయత్‌లు హాజరుకానున్నారు. అయితే, ఈ చర్చలో పాల్గొనకుండా భారత్ అధికారులు చివరి నిమిషంలో వెనుదిరిగారంటూ యూకేలోని పాక్ రాయబార కార్యాలయం తప్పుడు ప్రచారానికి తెరలేపింది. 'పాక్ బృందం ఇప్పటికే లండన్‌లో సిద్ధంగా ఉంది. ఆక్స్‌ఫర్డ్ చర్చల్లో పాల్గొనాల్సి ఉంది. అయితే, ఇందులో పాల్గొనకుండా భారత్ బృందం వైదొలగాలని నిర్ణయించుకుందని యూనియన్ నిర్వాహకులు తెలిపారు. అందుకు గల కారణాలు మాత్రం తెలపలేదని ఎక్స్‌లో రాసుకొచ్చింది. అయితే పాక్ అబద్ధపు ప్రచారాన్ని భారత్‌కు చెందిన సీనియర్ న్యాయవాది సాయి దీపక్ గట్టిగా తిప్పికొట్టారు. పాక్ తన తప్పుడు ప్రచారాలను ఇంకా కొనసాగిస్తూనే ఉందని ఎద్దేవా చేశారు. సుబ్రమణియన్, నరవాణెళి కొన్ని కారణాల వల్ల చర్చకు హాజరుకాలేకపోతున్నందున, వీరికి ప్రత్యామ్నా యాలు చూపాలని యూనియన్ అధికారులు తనను కోరారని దీపక్ చెప్పారు. ఈ క్రమంలో తాను యూకేకు వెళ్లి మరో బృందంతో చర్చకు సిద్ధమయినట్లు తెలిపారు. అయితే.. చర్చకు కొన్ని గంటల ముందు యూనియన్ అధికారులు తనకు కాల్ చేసి.. పాక్ తరఫున హాజరవ్వాల్సిన బృందం యూకేకు రాలేదని వెల్లడించారన్నారు. దీంతో చర్చ ఆగిపోవడం తనకు ఆగ్రహం తెప్పించిందన్నారు. పాక్ బృందం కూడా యూకేలోనే ఉందని, భారత్‌తో చర్చల్లో పాల్గొనేందుకు భయపడి వెనుదిరిగినట్లుగా కనిపిస్తుందని విమర్శించారు. తమను ఎదుర్కోలేక పిల్లల వెనక దాక్కుందని ఎద్దేవా చేశారు. దాయాది బృందం ఇంకా ఆక్స్‌ఫర్డ్‌లోనే ఉంటే.. తమతో చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. దీపక్ పోస్టులతో పాక్ ప్రకటనలు తప్పు అని మరోసారి స్పష్టమైంది. పాక్ చర్చలో పాల్గొనాల్సి వస్తే బేలతనం బయటపడుతుందనే ఇలా చేసి ఉంటుందని అనుకుంటున్నారు.

# స్మృతి, పలాశ్‌ల వివాహం రద్దంటూ పుకార్లు

**ఒక్క ఎమోజీతో చెక్ పెట్టిన ఇరువురు**

**త్వరలోనే పెళ్లి అంటూ కుటుంబ సభ్యుల వెల్లడి**

**ముంబై,నవంబర్29:** భారత మహిళల జట్టు స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన, మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్ వివాహం వాయిదా పడిన క్రమంలో అనేక పుకార్లు షికారు చేస్తున్నాయి. వీరి వివాహం మొత్తానికే రద్దయ్యిందన్న వార్తలు ప్రచారం సాగాయి. వారు వివాహాన్ని పూర్తిగా రద్దు చేసుకున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ఈ వార్తలకు స్మృతి-పలాశ్ దిష్టి రక్ష ఎమోజీతో చెక్ పెట్టారు. వారిరువురూ తాజాగా తమ ఇన్‌స్టాగ్రామ్ బయోలో దిష్టి రక్ష ఎమోజీని చేర్చుకున్నారు. దీంతో వారిరువురి మధ్య ఎటువంటి సమస్యలు లేవనే విషయంపై స్పష్టతనిచ్చినట్లైంది. ఇటీవల ఆమె ఇన్‌స్టా ఖాతాలో పెళ్లికి సంబంధించిన పోస్టులు కన్పించకపోవడం నెట్టింట చర్చనీయాంశంగా మారింది. పలాశ్‌తో ఎంగేజ్‌మెంట్‌ను ధ్రువీకరిస్తూ.. ఎంగేజ్‌మెంట్ రింగ్‌ను చూపిస్తూ స్మృతి పోస్టు చేసిన వీడియో ఆమె ఇన్‌స్టాలో కనిపించలేదు. ఇదే వీడియోను స్మృతి స్నేహితురాళ్లు జెమీమా, శ్రేయాంక కూడా సోషల్ మీడియా ఖాతాల నుంచి తొలగించడంతో పలాశ్‌కు, ఆమెకు మధ్య మనస్పర్థలు వచ్చాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అదే సమయంలో పలాశ్ ముచ్చల్ మరో మహిళతో మంధానను కించపరుస్తూ చాట్ చేసినట్లు ఆరోపిస్తున్న స్క్రీన్‌షాట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీంతో పలు వదంతులు వ్యాపించాయి. శుక్రవారం పలాశ్ తల్లి అమిత, ఓ ఆంగ్ల పత్రికతో మాట్లాడుతూ.. ఇప్పుడు అంతా బాగానే ఉందని, త్వరలో వారిద్దరి వివాహం జరుగుతుందని వివరించారు. 'స్మృతి మంధాన, పలాశ్ ముచ్చల్ ఇద్దరూ ప్రస్తుతం కష్టాల్లో ఉన్నారు. పలాశ్.. స్మృతిని అర్ధాంగిగా ఇంటికి తీసుకురావాలని కలలు కన్నాడు. నేను కూడా వారికి ప్రత్యేకంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసుకున్నా. ఇప్పుడంతా బాగానే ఉంది. వారిద్దరి వివాహం అతిత్వరలో జరుగుతుందని ఆమె అన్నారు. ఈ సమయంలో స్మృతి-పలాశ్ ఇన్‌స్టాలో తమ బయోను అప్‌డేట్ చేయడం గమనార్హం. ఈ ప్రకటనతో ఇక పుకార్లకు తెరపడే అవకాశం ఉందని అభిమానులు ఆశిస్తున్నారు.




---

# శుక్రమౌఢ్యమి ప్రవేశంతో శుభకార్యాలకు సెలవు


**ఫిబ్రవరి వరకు ముహూర్తాలు లేవంటున్న పండితులు**

**తిరుమల,నవంబర్29:** గ్రహాల గమన స్థితిని బట్టి ఇప్పుడు శృక్ర మౌఢ్యమి నడుస్తోంది. దీంతో శుభకార్యాలకు తావు లేదు. సాధరణంగా డిసెంబర్‌లో మళ్లీ మంచి ముహూర్తాలు వచ్చేవి కానీ ఈ యేడు అలాంటి అవకాశం లేదు. ఈసారి దాదాపు మూడు నెలల పాటు శుభ ముహూర్తాలు లేవని పండితులు సెలవిస్తున్నారు. ఈనెల 26న మార్గశిర మాసం శుద్ధ షష్ఠి నుంచి ప్రారంభమైన శుక్ర మౌఢ్యమి మాఘ బహుళ అమావాస్య ఫిబ్రవరి 17 వరకూ కొనసాగనుంది. దీంతో సుమారు 84 రోజుల పాటు శుభకార్యాలకు ముహూర్తాలు లేవు. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం.. ఒక గ్రహం సూర్యుడి కిరణాలలో కనుమరుగై పోవడాన్ని మౌఢ్యమి అంటారు. దీనినే వాడుక భాషలో మూఢమి అంటే చీకటి అంటారు. శుభకార్యాలకు గురుడు ఎంత ప్రధాన కారకుడో శుక్రుడూ అంతే ప్రభావం కలవాడు. గ్రహశక్తులు బలహీనమవడంతో శుక్ర గ్రహం సూచించే ఫలితాలు అంతగా అనుకూలంగా ఉండవు. శుక్రుడు బలహీనం అయితే సంబంధాలు, వివాహ జీవితం, ఆర్థిక స్థిరత్వంలో ప్రతికూలతలు ఏర్పడతాయని జ్యోతిషులు చెబుతున్నారు. అందుకే శుక్ర మౌఢ్యం



ఉన్న కాలంలో శుభకార్యాలు జరిపించడం శుభసూచకం కాదని సూచిస్తున్నారు. మార్గశిర, మాఘ, ఫాల్గుణ మాసాల్లో శుభకార్యాలు అధికంగా జరుగుతాయి. అయితే.. ఈసారి మార్గశిరంలో ఒకటి, రెండు ముహూర్తాలే ఉండగా.. పుష్యం శూన్య మాసం అవుతుంది. ఇక మాఘంలోనూ ఒక్క మూహూర్తం లేకపోవడం గమనార్హం. గృహ ప్రవేశాలకు అనుకూలమైన రథ సప్తమి, సరస్వతి జన్మదినమైన వసంత పంచమి మహామాఘ్‌గా కీర్తించబడే మాఘ పౌర్ణమి వంటి తిథులూ ఈసారి మూఢంలోనే కలిసిపోయాయి. ఈ నెల 26 నుంచి 2026 ఫిబ్రవరి 17 వరకు

# ఒకే కుటుంబంలో తీరని విషాదం



**అంతుచిక్కని వ్యాధితో ముగ్గురు బాలల మృతి**

**ఘటనతో అప్రమత్తం అయిన అధికార యంత్రాంగం**

**గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటుచేసి పర్యవేక్షణ**

**లక్నో,నవంబర్29:** ఉత్తరప్రదేశ్ లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. తీవ్ర జ్వరంతో బాధ పడుతూ గంటల వ్యవధిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారులు మృత్యువాత పడ్డారు. ఈ ఘటన ఆ రాష్ట్రంలో తీవ్ర కలకలం రేపింది. విషయం తెలిసిన వెంటనే అధికారులు అప్రమత్తమయ్యారు. నెబువా నౌరంగియా బ్లాక్‌లోని గులార్హియా తోలా గ్రామంలో వరుసగా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. వారి మృతికి కారణాలు తెలియరాలేదు. పింటు గౌర్ అనే వ్యక్తి కుమార్తె మంజు(7) వారం క్రితం అనారోగ్యానికి గురైంది. స్థానిక వైద్యుడి వద్ద చికిత్స అందించినప్పటికీ బాలిక కోలుకోలేదు. ఈ క్రమంలో మరో ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. ఆ తర్వాత కొన్ని గంటలకే గౌర్‌కు చెందిన చిన్న కుమార్తె ఖుషి (3), కుమారుడు కృష్ణ (5) కూడా జ్వరంతో మృతి చెందారు. ముగ్గురు చిన్నారుల మృతి నేపథ్యంలో వైద్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వీరి మృతికి గల కారణాలు తెలుసుకునేందుకు దర్యాప్తు చేపట్టారు. గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి.. గ్రామంలోని మిగిలిన పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. దర్యాప్తు అనంతరం పిల్లల మృతికి గల కారణాలు వెలువడతాయన్నారు. ఆరోగ్యశాఖ బృందం ఇప్పటివరకు గ్రామంలో 57 మంది పిల్లలకు మలేరియా, డెంగీ

# నేడు భారత్, దక్షిణాఫ్రికా తొలి వన్డే

## రాంచీ వేదికగా జరగనున్న మొదటి మ్యాచ్

## వన్డే సిరీస్‌లో సత్తా చాటాలని భావిస్తోన్న భారత్

రాంచీ: టెస్ట్ సిరీస్‌లో ఘోరంగా ఓడిపోయి దాదాపు అయిదారు దశాబ్దాల చెత్త రికార్డులను ఖాతాలో వేసుకున్న టీమిండియా వన్డే సిరీస్‌లో సత్తా చాటాలని భావిస్తోంది. ముఖ్యంగా హెడ్ కోచ్ గౌతం గంభీర్ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో భారత్, దక్షిణాఫ్రికా మధ్య వన్డే సిరీస్ కోసం రెండు జట్లు సిద్ధంగా ఉన్నాయి. వన్డే సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ నవంబర్ 30, 2025న రాంచీ వేదికలో భారత్, దక్షిణాఫ్రికా జట్లు తలపడనున్నాయి. టెస్ట్ సిరీస్ ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకుంటుందని క్రికెట్ ప్రేమికులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అందుకు కారణంగా దిగ్గజ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి పెద్ద ఆటగాళ్ళు జట్టులో ఉన్నారు. కనుక వన్డే సిరీస్ కోసం అభిమానులు చూస్తున్నారు. పటిష్ట టీమిండియా వన్డే సిరీస్ లో సఫారీలపై నెగ్గుతారని సంకేతాలు కనిపిస్తున్నాయి. భారత్, దక్షిణాఫ్రికా మధ్య మొదటి వన్డే రాంచీలో స్టేడియం కాంప్లెక్స్‌లో ఆదివారం నాడు జరగనుంది. అయితే స్టేడియానికి వెళ్లి చూడలేని వారు హాయిగా ఇంట్లో కూర్చుని లైవ్ స్ట్రీమింగ్, టీవీ ప్రసార ఆప్షన్లు ఉన్నాయి. వాటి గురించి క్రికెట్ అభిమానులు తెలుసుకోవాలి. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో రాణించిన సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టనున్నారు. దీంతో అభిమానుల చూపులన్నీ వాళ్లపైనే ఉండనున్నాయి. ఈ ఇద్దరూ బ్యాటింగ్‌లో రాణిస్తే, జట్టుకు భారీ స్కోర్ ఖాయం. సౌతాఫ్రికాపై విరాట్ గత రికార్డులు బాగుండడం, రోహిత్ శర్మ భీకర ఫామ్‌లో ఉండడం భారత్‌కు కలిసొచ్చే అంశాలు. ఇక రెగ్యులర్ కెప్టెన్ శుభమన్ గిల్, శ్రేయస్ అయ్యర్ గాయం కారణంగా దూరమయ్యారు. మహమ్మద్ షమి, బుమ్రా, సిరాజ్ లాంటి సీనియర్ పేసర్లలో ఒక్కరూ లేకుండా ఒక పెద్ద జట్టుతో భారత్ వన్డే సిరీస్ ఆడుతుండడం చాలా ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. బలమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న సౌతాఫ్రికాను భారత యువ పేసర్లు ఏ మేరకు కట్టడి చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. కెప్టెన్ గిల్ గైర్హాజరులో సీనియర్ ఆటగాడు %ఖా% రాహుల్ జట్టును నడిపించనున్నాడు. రోహిత్‌కుతో యశస్వీ జైస్వాల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించనున్నాడు. తర్వాత విరాట్ రానున్నాడు. తిలక్ వర్మ, రిషభ్ పంత్, %ఖా% రాహుల్‌తో పటిష్ఠ బ్యాటింగ్ లైనప్ ఉంది. మరో సీనియర్ రవీంద్ర జడేజాకు తుది జట్టులో చోటు ఖాయం కాగా, అతడికి తోడు మరో ఆల్‌రౌండర్‌గా వాషింగ్టన్ సుందర్ లేదా నితీశ్ కుమార్ రెడ్డిని ఎంచుకునే అవకాశం ఉంది. వన్డేలేలో కెప్టెన్‌గా కేఎల్ రాహుల్ రికార్డ్ మెరుగ్గానే ఉంది. ఇప్పటిదాకా 12 మ్యాచ్‌ల్లో టీమ్ఇండియాకు రాహుల్ నాయకత్వం వహించాడు. అందులో 8 వన్డేల్లో భారత్ గెలిచింది. మరో నాలుగింట్లో ఓడింది. ఓవరాల్‌గా విన్నింగ్ పర్సెంటేజీ 67 శాతంగా ఉంది.సీనియర్లకు లేకపోవడంతో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణకు తొలి వన్డేలో ఛాన్స్ దక్కే ఛాన్స్ ఉంది. మరి ఈ యువ ఆటగాళ్లు అనుభవజ్ఞులైన సఫారీ బ్యాటర్లకు ఎలా కళ్లెం వేస్తారో చూడాలి. ఒకరకంగా చెప్పాలంటే ఈ పేస్ త్రయానికి మాత్రం సౌతాఫ్రికా సిరీస్ కఠిన పరీక్ష కానుంది. టెస్టు సిరీస్ గెలిచిన ఉత్సాహంలో ఉన్న సఫారీలు వన్డే సిరీస్‌లోనూ సత్తాచాటాలని పట్టుదలతో ఉన్నారు. కెప్టెన్ బవుమా, మార్క్రమ్, రికిల్‌టన్, డికాక్, డేవిడ్ బ్రెవిస్, బ్రీట్జ్‌కేలతో బ్యాటింగ్ విభాగం దుర్భేద్యంగా కనిపిస్తోంది.



కార్బిన్ బాష్, మార్కో యాన్సెన్ వంటి నాణ్యమైన ఆల్‌రౌండర్లు ఉండగా స్పిన్ భారం కేశవ్ మహారాజ్ మోయనున్నాడు. స్టార్ పేసర్లు రబాడా, నోకియా దూరమైన నేపథ్యంలో ఎంగిడి నేతృత్వంలోని బౌలింగ్ దళం ఎంతమేర రాణిస్తోందో చూడాలి. నెమ్మదిగా ఉండే రాంచీ పిచ్‌పై భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశం లేదు. టాస్ గెలిచిన జట్టు తొలుత బౌలింగ్ తీసుకునే అవకాశం ఉంది. కాగా టీమిండియా, దక్షిణాఫ్రికా మధ్య రాంచీ వేదికగా జరగనున్న మొదటి వన్డే మ్యాచ్ జియోహాట్‌స్టార్ యాప్, జియో హాట్‌స్టార్ వెబ్‌సైట్‌లో ప్రత్యక్షంగా ప్రసారం చేయనున్నారు. భారత కాలమానం ప్రకారం ఆదివారం మధ్యాహ్నం 1:30 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఎప్పటిలాగే, మ్యాచ్‌ని చూడటానికి అభిమానులు జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ కలిగి ఉండాలి. టీవీలో భారత్, దక్షిణాఫ్రికా మధ్య వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్ చూడాలనుకునే వారు స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానెల్‌లలో మ్యాచ్ లైవ్ చూడవచ్చు. టాస్ ఆట ప్రారంభానికి 30 నిమిషాల ముందు, అంటే మధ్యాహ్నం 1:00 గంటలకు వేస్తారు. టాస్ తర్వాత భారత్, దక్షిణాఫ్రికా జట్ల ప్లేయింగ్ %శ×% ప్రకటిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు డే అండ్ నైట్ వన్డే ప్రారంభం కానుంది. వాస్తవానికి భారత్‌లో సిరీస్ కనుక ఉదయం వేళ నుంచి సాయంత్రం వరకు మ్యాచ్ ఉంటుందని ఆశించిన ఫ్యాన్సుకు నిరాశే ఎదురవుతోంది. భారత్, దక్షిణాఫ్రికా వన్డే సిరీస్: పూర్తి స్క్వాడ్‌లు భారత్ పూర్తి ఆటగాళ్లు– రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, కెఎల్ రాహుల్ (కెప్టెన్), తిలక్ వర్మ, రిషబ్ పంత్, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, రుతురాజ్ గైక్వాడ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్, ధ్రువ్ జురెల్ దక్షిణాఫ్రికా పూర్తి ఆటగాళ్లు – టెంబా బావుమా (కెప్టెన్), ఓట్నీల్ బార్ట్‌మన్,మాథ్యూ బ్రీట్జ్‌కే, ర్యాన్ రికెల్టన్, ఐడెన్ మార్క్రమ్, కార్బిన్ బోష్, డెవాల్డ్ బ్రెవిస్, నాంద్రే బర్గర్, క్వింటన్ డి కాక్, రూబిన్ హెర్మన్, కేశవ్ మహారాజ్, టోనీ డి జోర్జీ, మార్కో జాన్సెన్, లుంగి ఎంగిడి,

# స్ట్రాంగ్ స్క్వాడ్‌ను సిద్ధం చేసిన ముంబై ఇండియన్స్

## మహిళా ప్రీమియర్ లీగ్ కోసం భారీ కసరత్తు

రెండుసార్లు మహిళా ప్రీమియర్ లీగ్ ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్, మహిళా ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ కోసం ఒక స్ట్రాంగ్ స్క్వాడ్‌ను సిద్ధం చేసింది. వేలానికి ముందు ఐదుగురు కీలక ఆటగాళ్లను రిటైన్ చేసుకున్న ముంబై ఇండియన్స్, వేలంలో న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్ అమెలియా కెర్ కోసం ఏకంగా రూ.3 కోట్ల భారీ మొత్తాన్ని వెచ్చించింది. పాత ఆటగాళ్లైన షబ్నిమ్ ఇస్మాయిల్, సంస్కృతి గుప్తా, సజన సజీవన్ మళ్లీ జట్టులోకి రావడంతో ముంబై జట్టు మరింత పటిష్టంగా కనిపిస్తోంది. ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ యజమాని నీతా అంబానీ, తాము గతేడాది జట్టులోని ఎక్కువ మంది ఆటగాళ్లను తిరిగి కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. నవంబర్ 27) జరిగిన మహిళా ప్రీమియర్ లీగ్ వేలం గురించి మాట్లాడిన ముంబై ఇండియన్స్ సహ–యజమాని నీతా అంబానీ, వేలం రోజు చాలా ఉత్సాహంగా, కొన్నిసార్లు టెన్షన్‌గా కూడా గడిచిందని అన్నారు. 2025లో ఛాంపియన్‌గా నిలిచిన జట్టులోని ఎక్కువ మంది ఆటగాళ్లను తిరిగి కొనుగోలు చేయడమే తమ ప్రధాన వ్యూహమని ఆమె వెల్లడించారు. కీలకమైన ఆటగాళ్లు తిరిగి జట్టులోకి రావడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. వేలంలో అమెలియా కెర్ తిరిగి జట్టులోకి రావడం అలాగే షబ్నిమ్ ఇస్మాయిల్, సైకా ఇషాక్, సజన సజీవన్, సంస్కృతి గుప్తా వంటి నలుగురు భారతీయ ప్లేయర్లు మళ్లీ రావడం ముంబై ఇండియన్స్‌కు పెద్ద బలం అని ఆమె అన్నారు. అంతేకాకుండా రాహిలా ఫిర్దౌస్, నల్లా క్రాంతి రెడ్డి, త్రివేణి వశిష్ఠ వంటి యువ ప్రతిభావంతులతో పాటు, పూనమ్ ఖేమ్నార్, మిల్లీ ఇల్లింగ్‌వర్త్, నికోలా కేరీలను కూడా ముంబై ఇండియన్స్ ఫ్యామిలీలోకి స్వాగతించారు. ముంబై ఇండియన్స్ జట్టు ఇప్పటికే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో పాటు, నాట్ సైవర్–బ్రంట్, హేలీ మాథ్యూస్, అమన్‌జోత్ కౌర్, జి కమలిని వంటి ఐదుగురు కీలక ఆటగాళ్లను రిటైన్ చేసుకుంది. వేలంలో ఇటీవల టీ20 ప్రపంచ కప్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచిన అమెలియా కెర్, ఫాస్ట్ బౌలర్ షబ్నిమ్ ఇస్మాయిల్ తిరిగి రావడం



కోర్ టీమ్‌ను మరింత పటిష్టం చేసింది. ప్రపంచ కప్ విజేత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా న్యూఢిల్లీలో జరిగిన వేలానికి హాజరై, వేలం టేబుల్‌పై వ్యూహాలను రచించడంలో కీలక పాత్ర పోషించారు. వేలంలో తన అనుభవం గురించి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మాట్లాడుతూ.. "నేను మొదట్లో కొంచెం కంగారు పడ్డాను, కానీ మేము ప్రణాళిక చేసిన విధానం, అందరి భాగస్వామ్యం నాకు చాలా బాగా నచ్చింది. నీతా అంబానీ ఎప్పుడూ జట్టుకు సపోర్టుగా ఉండి మాకు అండగా నిలుస్తారు. మా పాత సహచరులలో ఎక్కువ మందిని మేము తిరిగి పొందాము. ఇది ఆ ఆటగాళ్లపై జట్టుకు ఉన్న నమ్మకాన్ని చూపుతుంది" అని అన్నారు. ముంబై ఇండియన్స్ విజయాలలో సైకా, సజన, సంస్కృతి వంటి ఇండియన్ ప్లేయర్లు కీలక పాత్ర పోషించారు. వారు టోర్నమెంట్‌లో ఎదుగుతున్న స్టార్ ప్లేయర్‌లుగా నిలిచారు. ముంబై ఇండియన్స్ జట్టు.. అనేక ప్రపంచ కప్‌ల విజేత అయిన నికోలా కేరీ, యువ ఫాస్ట్ బౌలర్ మిల్లీ ఇల్లింగ్‌వర్త్ అనే ఆస్ట్రేలియన్ జోడీని కూడా తమ జట్టులో చేర్చుకుంది. అలాగే యంగ్ ఇండియన్ టాలెంటుకు సపోర్ట్ ఇచ్చే తమ విధానానికి అనుగుణంగా, భారతీయ ఆల్‌రౌండర్‌లు నల్లా క్రాంతి రెడ్డి, త్రివేణి వశిష్ఠలను కూడా కొనుగోలు చేసింది. వీరిద్దరూ తొలిసారి డబ్ల్యూపీఎల్ లో ఆడనున్నారు.

# 9 ప్రపంచ రికార్డుల ముంగిట కోహ్లి

క్రికెట్ ప్రపంచంలో కింగ్ కోహ్లీగా ప్రఖ్యాతి గాంచిన విరాట్ కోహ్లీకి నవంబర్ 30 నుంచి ప్రారంభం కానున్న మూడు వన్డే మ్యాచ్‌ల సౌతాఫ్రికా సిరీస్ చాలా కీలకం కానుంది. ఇది కోహ్లీకి కేవలం ఒక సాధారణ సిరీస్ కాదు, ఏకంగా తొమ్మిదికి పైగా అరుదైన ప్రపంచ రికార్డులను తన ఖాతాలో వేసుకునే అద్భుతమైన అవకాశం. అత్యంత వేగంగా 28,000 అంతర్జాతీయ పరుగులు పూర్తి చేయడం నుంచి, ఒకే ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు సాధించడం వరకు%ొ% ఈ సిరీస్‌లో విరాట్ కొట్టే ప్రతి పరుగు చరిత్ర సృష్టించనుంది.విరాట్ కోహ్లీ ప్రస్తుతం వన్డే క్రికెట్‌లో 51 సెంచరీలతో, టెస్టుల్లో 51 సెంచరీలు సాధించిన సచిన్ టెండూల్కర్ రికార్డుతో సమంగా ఉన్నాడు. ఈ సిరీస్‌లో విరాట్ కేవలం ఒక్క సెంచరీ సాధిస్తే, వన్డేల్లో 52 సెంచరీలు పూర్తి చేసుకుంటాడు. తద్వారా అతను ఏ ఒక్క ఫార్మాట్‌లో అయినా అత్యధిక సెంచరీలు సాధించిన ఏకైక బ్యాట్స్‌మెన్‌గా నిలిచి, సచిన్ టెండూల్కర్ రికార్డును అధిగమిస్తాడు. ఈ అరుదైన రికార్డు కోసం యావత్ క్రికెట్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత వేగంగా పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాలో కూడా కోహ్లీ ముందున్నాడు. విరాట్ 28,000 అంతర్జాతీయ పరుగులు పూర్తి చేయడానికి 327 పరుగులు మాత్రమే అవసరం. రాబోయే 23 ఇన్నింగ్స్‌లలో విరాట్ ఈ పరుగులు చేస్తే, అత్యంత వేగంగా 28,000 పరుగులు సాధించిన బ్యాట్స్‌మెన్‌గా సచిన్ టెండూల్కర్ రికార్డును కూడా బద్దలు కొట్టే అవకాశం ఉంది. అలాగే, ప్రస్తుతం విరాట్ ఖాతాలో 27,673 అంతర్జాతీయ పరుగులు ఉన్నాయి. అతను కేవలం 344 పరుగులు చేస్తే, శ్రీలంక దిగ్గజం కుమార సంగాక్కర (28,016 పరుగులు)ను అధిగమించి, సచిన్ టెండూల్కర్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు సాధించిన రెండవ బ్యాట్స్‌మెన్‌గా నిలుస్తాడు.ఈ సిరీస్‌లో విరాట్ సౌతాఫ్రికాపై, భారత గడ్డపై కూడా అనేక ప్రత్యేక రికార్డులు సాధించే అవకాశం ఉంది. కేవలం ఒక సెంచరీ సాధిస్తే, సౌతాఫ్రికాపై 6 వన్డే సెంచరీలు చేసిన ప్రపంచంలోనే ఏకైక బ్యాట్స్‌మెన్‌గా నిలుస్తాడు. అలాగే, గెలిచిన మ్యాచ్‌లలో మరో 14 పరుగులు చేస్తే, సౌతాఫ్రికాపై భారత్ విజయాలలో 1000 వన్డే పరుగులు చేసిన తొలి భారతీయుడిగా రికార్డు సృష్టిస్తాడు. %ాజుచీూ%



(సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాలపై గెలిచిన వన్డే మ్యాచ్‌లలో అత్యధిక పరుగులు చేసిన ప్రపంచ రికార్డుకు కేవలం 16 పరుగులు దూరంలో మాత్రమే ఉన్నాడు.స్వదేశంలో ఒక 50ం స్కోరు సాధిస్తే, భారత గడ్డపై వన్డేల్లో అత్యధిక 50ం స్కోర్లు చేసిన రికార్డును సొంతం చేసుకుంటాడు. అంతేకాకుండా, ఒక హాఫ్ శతకం సాధిస్తే, దేశీయ మైదానాల్లో 100 హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్న ఏకైక ఆటగాడిగా అరుదైన మైలురాయిని చేరుకుంటాడు.

# ఆయుష్ మాత్రే సిక్సర్ల వర్షం

2025–26 సయ్యద్ ముష్తాక్ అలీ ట్రోఫీ 2025–26) లో భాగంగా జరిగిన ఎలైట్ గ్రూప్ A మ్యాచ్‌లో విదర్భ, ముంబై జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో ముంబై 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. భారతరత్న శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి ఎకానా క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ టీ20 మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన విదర్భ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ముంబై కేవలం 17.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. ముంబై తరపున అద్వితీయ సెంచరీ చేసిన ఆయుష్ మాత్రే ఈ విజయానికి ప్రధాన రూపశిల్పి అయ్యాడు. మ్యాచ్ ప్రారంభంలో, టాస్ గెలిచిన ముంబై కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. ముందుగా బ్యాటింగ్ చేసిన విదర్భ తొలి వికెట్‌కు 115 పరుగులు జోడించడం ద్వారా మంచి ఆరంభాన్ని ఇచ్చింది. అథర్వ టైడే 64 పరుగులు, అమన్ మొఖడే 61 పరుగులు సాధించారు. అయితే, ఈ ఇద్దరు ఆటగాళ్లు అవుట్ అయిన తర్వాత ఆరుగురు బ్యాట్స్‌మెన్ రెండంకెల స్కోరును చేరుకోకపోవడంతో విదర్భ ఇన్నింగ్స్ కుప్పకూలింది. ఒకప్పుడు 200 కంటే ఎక్కువ స్కోరు




చేసిన విదర్భ చివరికి 192 పరుగులకే ఆలౌట్ అయింది.ఈ భారీ స్కోరును ఛేదించే క్రమంలో, 18 ఏళ్ల ఆయుష్ మాత్రే ముంబై తరపున చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడు. ఆయుష్ మాత్రే కేవలం 53 బంతుల్లోనే అజేయంగా 110 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో, ఆయుష్ మాత్రే 8 ఫోర్లు, 8 సిక్సర్లు బాదాడు. అతను కేవలం ఫోర్ల ద్వారా 80 పరుగులు చేశాడు.ఆయుష్ మాత్రేతో పాటు సూర్యకుమార్ యాదవ్ కూడా 30 బంతుల్లో 35 పరుగులు చేశాడు. అదే సమయంలో, శివమ్ దూబే 19 బంతుల్లో 205.26

# టెస్ట్ క్రికెట్‌కు బుమ్రా దూరంగా ఉండాలి

## మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ సూచన

టెస్ట్ ఫార్మాట్‌కు టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా దూరంగా ఉండాలని మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ సూచించాడు. రెడ్ బాల్ క్రికెట్ కంటే వైట్‌బాల్ ఫార్మాట్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని అభిప్రాయపడ్డాడు. సౌతాఫ్రికాతో రెండు టెస్ట్‌ల సిరీస్ ఆడిన బుమ్రాకు వన్డే సిరీస్ నుంచి విశ్రాంతినిచ్చిన సంగతి తెలిసిందే. అప్‌కమింగ్ టీ20 సిరీస్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.తాజాగా బుమ్రా గురించి తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా ఏబీ డివిలియర్స్‌తో మాట్లాడిన అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'నాకు బుమ్రాతో మంచి రిలేషన్ ఉంది. ప్రస్తుతం నేను అతని దగ్గరగా ఉండి ఉంటే.. బుమ్రాకు ఒకటే మాట




చెప్పేవాడిని. పరిమిత ఓవర్ల క్రికెట్‌కు ప్రాధాన్యతమివ్వాలని సూచించేవాడని. మరీ అవసరమైతే తప్ప టెస్ట్ క్రికెట్ ఆడవద్దని సలహా ఇచ్చేవాడిని. కానీ అతనికి సుదీర్ఘ ఫార్మాట్‌లో ఆడటం అంటే చాలా ఇష్టమనే సంగతి నాకు తెలుసు. అతను వీలైనంత కాలం టెస్ట్ క్రికెట్ ఆడటానికే మొగ్గు చూపుతాడు. అది సవాల్‌తో కూడుకున్న విషయం అని కూడా తెలుసు.జస్‌ప్రీత్ బుమ్రా టీ20 క్రికెట్ ఆడాలి. అతను అర్థరహిత వన్డేలు ఆడాలని నేను కోరుకోవడం లేదు. టెస్ట్‌లు.. అది కూడా విదేశాల్లో జరిగే మ్యాచ్‌ల్లోనూ అతను ఆడాలని కోరుకుంటున్నా. టీమిండియా సొంతగడ్డపై ఆడుతున్నప్పుడు ఇతర ఫాస్ట్ బౌలర్ల సేవల్ని ఉపయోగించుకోవాలి.'

# 'డిస్కవర్ ఆంధ్ర' డాక్యుమెంటరీ

## సాయి దుర్గా తేజ్, నవదీప్ సారథ్యంలో డాక్యుమెంటరీ రూపకల్పన

**ప్రాజెక్టుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, అటవీ శాఖ పూర్తి సహకారం**

**మన సంస్కృతి, ప్రకృతిని కాపాడుకోవాలని పిలుపునిచ్చిన సాయి తేజ్**




ఆంధ్రప్రదేశ్‌లోని అద్భుతమైన ప్రకృతి అందాలు, అటవీ సంపదను ప్రపంచానికి పరిచయం చేసే లక్ష్యంతో 'డిస్కవర్ ఆంధ్ర' అనే డాక్యుమెంటరీ తెరకెక్కుతోంది. శ్రీకాంత్ మన్నెపురి దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్టుకు సుప్రీం హీరో సాయి దుర్గా తేజ్, యంగ్ హీరో నవదీప్ సారథ్యం వహిస్తున్నారు. ఏపీ అటవీ శాఖ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహకారంతో రూపొందుతున్న ఈ డాక్యుమెంటరీ టైటిల్ గ్లింప్స్‌ను తాజాగా విడుదల చేశారు.

ఈ సందర్భంగా సాయి దుర్గా తేజ్ మాట్లాడుతూ, మన సంస్కృతిని, ప్రకృతిని మనమే కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని పిలుపునిచ్చారు. "మన చుట్టూ ఇన్ని అద్భుతాలు ఉన్నాయా అని ఈ డాక్యుమెంటరీ చూస్తే తప్పక అనిపిస్తుంది. పర్యావరణ పరిరక్షణ కోసం 2020లో 'గ్రీన్ పాస్' అనే ఎన్జీవో ప్రారంభించాను. నా 'రిపబ్లిక్' సినిమాలో కూడా ఇదే అంశాన్ని చర్చించాం. ఈ డాక్యుమెంటరీకి మణిశర్మ మ్యూజిక్ అందించడం సంతోషంగా ఉంది. ఇలాంటి మంచి ప్రయత్నాలకు ప్రేక్షకులు, మీడియా మద్దతుగా నిలవాలి" అని కోరారు.

హీరో నవదీప్ మాట్లాడుతూ.. ఈ డాక్యుమెంటరీకి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహకారం ఎలా లభించిందో వివరించారు. "ఆంధ్రలోని వైల్డ్‌లైఫ్‌ను ప్రపంచానికి చూపించాలనే తన కోరికను సాయి తేజ్ నాతో పంచుకున్నారు. నేను వెంటనే ఈ విషయాన్ని పవన్ కళ్యాణ్ గారి దృష్టికి తీసుకెళ్లాను. ఆయన తక్షణమే స్పందించి, ప్రాజెక్టుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించేలా చూశారు. 72 నిమిషాల నిడివితో శ్రీకాంత్ రూపొందించిన ఈ డాక్యుమెంటరీ చూసి మన రాష్ట్రంలో ఇన్ని అద్భుతాలు ఉన్నాయా అని అందరూ ఆశ్చర్యపోతారు" అని తెలిపారు.

పడాల సురేందర్ రెడ్డి, శ్రావ్య కూనం సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ డాక్యుమెంటరీ, ఏపీలోని అద్భుతమైన ప్రాంతాలను వెలుగులోకి తీసుకురావాలనే లక్ష్యంతో రూపొందుతోంది.

# ఆంధ్రా కింగ్ నువ్వే అనగానే టెన్షన్ పడ్డాను: ఉపేంద్ర



రామ్ పోతినేని కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం %-%ఆంధ్రా కింగ్ తాలూకా%-%. ఈనెల 28న విడుదలైన ఈ చిత్రం విమర్శకుల నుండి సానుకూల సమీక్షలను అందుకుంది. మహేష్ బాబు పి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శాండల్‌వుడ్ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో నటించారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఈరోజు హైదరాబాద్‌లో నిర్మాతలు విజయోత్సవ సభను నిర్వహించారు.సక్సెస్ మీట్ లో ఉపేంద్ర మాట్లాడుతూ.. తనపై తెలుగు ప్రజల అపారమైన ప్రేమాభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపేంద్ర మాట్లాడుతూ -%--%ఈ ఆఫర్ రాగానే థ్రిల్లయ్యాను. ఎందుకంటే ఇది బలమైన భావోద్వేగాలతో నిండి ఉంది. నాకు ఉన్న ఏకైక ఆందోళన టైటిల్ గురించి. నేను ఆంధ్రా కింగ్ అని మేకర్స్ అన్నారు. దానికి టెన్షన్ పడ్డాను. నేను %-%ఆంధ్రా కింగ్%-% ఎలా కాగలను? కానీ నేను వచ్చినప్పుడల్లా ఇక్కడి ప్రజలు నన్ను ముక్తకంఠంతో స్వాగతించారు, అందుకే నేను కింగ్‌లా ఫీలయ్యాను. తెలుగు ప్రేక్షకులు పెద్ద హృదయం కలిగి ఉన్నారు. గత 25 సంవత్సరాలుగా నాకు ఈ హృదయపూర్వక స్వాగతం లభిస్తున్నందుకు ఆనందంగా ఉన్నాను%--% అన్నారు.ఇలాంటి అవకాశం కల్పించిన మైత్రి మూవీ మేకర్స్ కు నేను నిజంగా కృతజ్ఞుడను అని ఉపేంద్ర అన్నారు. నా సహ నటులు, సాంకేతిక నిపుణులకు ధన్యవాదాలు. నా అభిమానులు సాగర్, మహాలక్ష్మి (రామ్-భాగ్యశ్రీ) లకు ఆయన బ్లెస్సింగ్స్ అందించారు. ప్రస్తుతం రామ్ , భాగ్యశ్రీ అమెరికాలో ఈ సినిమాను ప్రమోట్ చేస్తున్నారు.. కానీ నేను ఇక్కడే ఉన్నాను అని కూడా తెలిపారు. నిజానికి నేను స్టార్ ని కదా నన్ను యుఎస్ కి పంపాలి అంటూ సరదాగా జోక్ చేసారు ఉప్పీ.



# అనుకోకుండా వచ్చిన ఆఫర్..

## నా జీవితాన్నే మార్చేసింది: కృతి శెట్టి

'ఉప్పెన' చిత్రంతో తొలి సినిమాకే ఓవర్‌నైట్ స్టార్‌గా మారిన నటి కృతి శెట్టి, తాను సినీ రంగంలోకి అనుకోకుండా ఎలా అడుగుపెట్టిందీ ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఒకప్పుడు వరుస ఆఫర్లతో దూసుకెళ్లిన ఆమె, ప్రస్తుతం ఫ్లాపులతో సతమతమవుతూ తమిళ చిత్రాలపై దృష్టి సారించారు.తన కెరీర్ ఆరంభం గురించి కృతి మాట్లాడుతూ... "నేనొక కమర్షియల్ యాడ్ ఆడిషన్ కోసం స్టూడియోకి వెళ్లాను. ఆడిషన్ తర్వాత నన్ను తీసుకెళ్లడానికి నాన్న రావాల్సి ఉండగా, ఆయనకు కాస్త ఆలస్యమైంది. ఆ ఖాళీ సమయంలో పక్కనే ఉన్న మరో స్టూడియోలోకి వెళ్లాను. అక్కడ ఒక సినిమా ఆడిషన్స్ జరుగుతున్నాయి. నన్ను చూసిన యూనిట్ సభ్యులు సినిమాల్లో నటిస్తావా? అని అడిగారు. ఏం చెప్పాలో తెలియక మా అమ్మ నంబర్ ఇచ్చి వచ్చేశాను. వాళ్లు అమ్మకు ఫోన్ చేసి ఆడిషన్‌కు పిలిచారు. అలా అనుకోకుండా నాకు 'ఉప్పెన' సినిమాలో హీరోయిన్‌గా అవకాశం వచ్చింది. అంతా ఓ కలలా జరిగిపోయింది" అని వివరించారు.'ఉప్పెన' బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత కృతి శెట్టికి అవకాశాలు వెల్లువెత్తాయి. నానితో 'శ్యామ్ సింగ రాయ్', నాగచైతన్యతో 'బంగార్రాజు' చిత్రాలు పర్వాలేదనిపించినా, ఆ తర్వాత వచ్చిన 'ది వారియర్', 'మాచర్ల నియోజకవర్గం', 'కస్టడీ', 'మనమే' వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా పడ్డాయి. దీంతో ఆమె కెరీర్ గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోయింది. ప్రస్తుతం కొంత గ్యాప్ తీసుకున్న కృతి, కోలీవుడ్‌లో రెండు ప్రాజెక్టులతో బిజీగా ఉంది. 'వా వాతియార్', 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' అనే చిత్రాల్లో నటిస్తోంది. ఈ సినిమాలపై తమిళ పరిశ్రమలో మంచి అంచనాలున్నాయి. ఈ చిత్రాలతోనైనా కృతి శెట్టి తిరిగి విజయాల బాట పడుతుందేమోనని ఆమె అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# వివరణ ఇచ్చినా కాజోల్ ను వదలని నెటిజన్లు...




బాలీవుడ్ నటి కాజోల్ వివాదంలో చిక్కుకున్నారు. ఓ టాక్ షోలో ఆమె పెళ్లి బంధంపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. పెళ్లికి కూడా ఎక్స్‌పైరీ డేట్ ఉండాలని, అవసరమైతే రెన్యూవల్ చేసుకునే ఆప్షన్ కూడా ఉంటే బాగుంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

వివరాల్లోకి వెళ్తే, ఓ ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫార్మ్ కోసం కాజోల్, ట్వింకిల్ ఖన్నా కలిసి ఓ చర్చా కార్యక్రమానికి హోస్టులుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల ప్రసారమైన ఎపిసోడ్‌కు నటులు విక్కీ కౌశల్, కృతి సనన్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాజోల్.. "నచ్చని వారితో బలవంతంగా జీవించడం ఎందుకు? పెళ్లికి కూడా గడువు తేదీ ఉండాలి కదా" అని వ్యాఖ్యానించారు. దీనికి ట్వింకిల్ మద్దతు పలకగా, విక్కీ, కృతి మాత్రం ఈ అభిప్రాయాన్ని వ్యతిరేకించారు.ఈ వ్యాఖ్యలు క్షణాల్లో వైరల్ కావడంతో నెటిజన్లు కాజోల్, ట్వింకిల్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. వివాహ బంధం విలువను తగ్గించేలా మాట్లాడటం సరికాదని, బాధ్యతగల స్థానంలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సమాజంపై చెడు ప్రభావం చూపుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.విమర్శలు పెరగడంతో కాజోల్, ట్వింకిల్ స్పందించారు. షోలో సరదాగా జరిగిన సంభాషణను సీరియస్‌గా తీసుకోవద్దని కాజోల్ కోరారు. ఇది కేవలం హాస్యం కోసమేనని, మొదటి ఎపిసోడ్ నుంచే డిస్క్లెమర్ ఇస్తున్నామని ట్వింకిల్ వివరణ ఇచ్చారు. అయితే, వారి వివరణను కూడా నెటిజన్లు అంగీకరించడం లేదు. ముందు మాట్లాడి, తర్వాత సరదా అనడం సరికాదని, పబ్లిక్ ప్లాట్‌ఫార్మ్‌లపై మాట్లాడేటప్పుడు బాధ్యతగా ఉండాలని హితవు పలుకుతున్నారు.





# కార్తి అన్నగారు వస్తారు

## టీజర్.. ఎనర్జీ అదిరింది..!

కోలీవుడ్ స్టార్ కార్తి హీరోగా వస్తున్న కొత్త సినిమా టీజర్ రిలీజైంది. ఈ సినిమాకు తమిళ్ లో వా వాతియార్ అనే టైటిల్ పెట్టగా తెలుగులో అన్నగారు వస్తారు అనే పేరుని ఫిక్స్ చేశారు. నలన్ కుమారస్వామి డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ వా వాతియార్ అదే అన్నగారు వస్తారు సినిమాను స్టూడియో గ్రీన్ బ్యానర్ లో కే.యి జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. అన్నగారు వస్తారు సినిమాలో కార్తి సరసన కృతి శెట్టి హీరోయిన్ గా నటిస్తుంది. సంతోష్ నారాయణన్ మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమా టీజర్ ని ఒక సాంగ్ బిట్ రూపంలో రిలీజ్ చేశారు.సినిమాలో పోలీస్ గా నటిస్తున్న కార్తీ అలా కార్ దిగి రాగానే అతనికి వెల్కం చెబుతున్న సందర్భంలో వెనుక మ్యూజిక్.. కార్తి గ్రేస్ ఫుల్ స్టెప్స్ అబ్బా ఫ్యాన్స్ కి అయితే సూపర్ అనిపించేస్తుంది.

# అఖండ-2 టీజర్ కు అదిరిపోయే రెస్పాన్స్




నటసింహం నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను కలయికలో రూపొందుతున్న భారీ చిత్రం 'అఖండ 2' నుంచి పవర్ఫుల్ టీజర్ విడుదలైంది. 'అఖండ 2 మ్యాసివ్ తాండవం' పేరుతో విడుదలైన ఈ టీజర్‌కు ప్రేక్షకుల నుంచి, ముఖ్యంగా అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సోషల్ మీడియాలో ఈ టీజర్ ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉంది.

"చెడు ఎక్కడ జరిగినా దేవుడు ఏదో ఒక రూపంలో ప్రత్యక్షమవుతాడు.. బీ బ్రేవ్" అంటూ బాలకృష్ణ తనదైన శైలిలో చెప్పిన డైలాగ్ టీజర్‌కు హైలైట్‌గా నిలిచింది. టీజర్‌లోని యాక్షన్ సన్నివేశాలు, విజువల్స్, నేపథ్య సంగీతం సినిమాపై అంచనాలను భారీగా పెంచాయి. గతంలో సంచలన విజయం సాధించిన 'అఖండ' చిత్రానికి సీక్వెల్‌గా ఈ సినిమా తెరకెక్కుతోంది.

# నోబుల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అల్లు అర్జున్ కూతురు అర్హ

## యంగెస్ట్ చెస్ ట్రైనర్‌గా నోబుల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ గారాలపట్టి అల్లు అర్హ చిన్న వయసులోనే అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. యంగెస్ట్ చెస్ ట్రైనర్‌గా అసాధారణ ప్రతిభ కనబరిచి నోబుల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకుంది. ఈ వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే, అల్లు అర్హ 30 చెస్ పజిల్స్‌ను పరిష్కరించడంలో ఏకంగా 50 మంది విద్యార్థులకు విజయవంతంగా శిక్షణ ఇచ్చింది.